పక్కా తెలుగు

PRGI REGD No.: TGTEL/26/A4986

# ప్రభాత కిరణం

సత్యానికి వారధి

5 DOTS NETWORK

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 01 | సంచిక : 016 | శుక్రవారం | 10-07-2026 | పేజీలు : 08 | వెల: రూ.4/- www.prabhathakiranam.com

Medchal Malkajigiri | Volume : 01 | Issue : 016 | Friday | 10-07-2026 | Pages: 08 | Price : Rs.4/- Circulated to Telangana | Published from Medchal Malkajgiri



## ద్వైపాక్షిక బంధానికి కొత్త బలం

» రక్షణ, ఇంధనం, పెట్టుబడుల్లో దూకుడు
» మెల్‌బోర్న్ వేదికగా చారిత్రక నిర్ణయాలు
» ఇండో-పసిఫిక్‌పై భారత్-ఆస్ట్రేలియా ఫోకస్
» రక్షణ నుంచి యురేనియం వరకు 18 కీలక ఒప్పందాలు

ఇండోపసిఫిక్ ప్రాంతంలో వ్యూహాత్మక సమీకరణలు వేగంగా మారుతున్న వేళ భారత్, ఆస్ట్రేలియా తమ భాగస్వామ్యాన్ని మరో మెట్టు పైకి తీసుకెళ్లాయి. మెల్‌బోర్న్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ మధ్య జరిగిన శిఖరాగ్ర సమావేశంలో రక్షణ, పౌర అణుశక్తి, సముద్ర భద్రత, క్రిటికల్ మినరల్స్, ఇంధన భద్రత, సైబర్ టెక్నాలజీ, పెట్టుబడులు, విద్య వంటి కీలక రంగాల్లో 18 ఒప్పందాలు కుదిరాయి. ముఖ్యంగా ఆస్ట్రేలియా నుంచి భారత్‌కు యురేనియం సరఫరాకు మార్గం సుగమం కావడం ఈ పర్యటనలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రాంతీయ భద్రతతో పాటు ద్వైపాక్షిక ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలకు ఈ ఒప్పందాలు కొత్త ఊపు ఇవ్వనున్నాయని ఇరు దేశాల నాయకులు ప్రకటించారు.

(వివరాలు 2లో..)

## తెలంగాణలో భవిష్యత్ బీజేపీదే



**బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో ప్రజలు విసిగిపోయారు**

**ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్న జేపీ నడ్డా**

తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా విమర్శించారు. హైదరాబాద్ పర్యటన సందర్భంగా రాష్ట్ర నాయకులతో సమావేశమైన ఆయన, ఇతర పార్టీల నేతలు బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ విభేదాలు పక్కనపెట్టి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలతో సన్నిహితంగా ఉంటేనే పార్టీ బలపడుతుందని సూచించారు. (వివరాలు 2లో..)



# హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నా డ్రీమ్

### స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభిన సీఎం

హైదరాబాద్‌ను భవిష్యత్‌లో ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్య నగరంగా తీర్చిదిద్దాలనేది తన కల అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషతో కలిసి గచ్చిబౌలిలో యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌ను ప్రారంభించిన ఆయన స్పోర్ట్స్ యూనివర్సిటీ లోగో, వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. పీటీ ఉష దేశ యువతకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి కోసం ప్రత్యేక స్పోర్ట్స్ పాలసీ తీసుకొచ్చామని చెప్పారు. 1990 నుంచి 2004 వరకు హైదరాబాద్ అనేక అంతర్జాతీయ క్రీడలకు వేదికగా నిలిచిందని, గత రెండు దశాబ్దాలుగా అలాంటి అవకాశాలు తగ్గాయని పేర్కొన్నారు. ఈ ఏడాది నవంబర్‌లో ఖేలో ఇండియా గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వబోతోందని వెల్లడించారు. చదువు ఒక్కటే కాదు, క్రీడలు కూడా ఉపాధికి బాటలు వేస్తాయని అన్నారు. ఒలింపిక్స్‌లో భారత్ మరిన్ని పతకాలు సాధించేలా క్రీడా మౌలిక వసతులు, ప్రతిభాభివృద్ధిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు.

## మూసీ పునరుజ్జీవనానికి గ్రీన్ సిగ్నల్

### తొలి దశకు రూ.7,345 కోట్ల ఆమోదం

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు అమలులో తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. తొలి దశ అభివృద్ధి పనులకు రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. జోన్ 1ఏ, జోన్ 1బీ ప్రాధాన్య కారిడార్లలో రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేపట్టనున్నారు. హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9.20 కిలోమీటర్లు, ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.80 కిలోమీటర్ల మేర పనులు కొనసాగనున్నాయి. మొత్తం 21 కిలోమీటర్ల ప్రాధాన్య ప్రాంతంలో రివర్‌ఫ్రంట్‌ను అభివృద్ధి చేయనున్నారు. భూసేకరణ వ్యయం మినహా ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించారు. ఇందులో ఆసియా అభివృద్ధి బ్యాంకు నుంచి రూ.4,500 కోట్ల రుణం, మిగిలిన రూ.2,845.12 కోట్లను ఇతర ఆర్థిక సంస్థల నుంచి సమీకరించనున్నారు. ఈపీసీ విధానంలో పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాజెక్టు పర్యవేక్షణ కోసం ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ నియామకానికీ ఆమోదం తెలిపింది.

## 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల తెలంగాణ

**అభివృద్ధి బ్లూప్రింట్ ప్రకటించిన సీఎం రేవంత్**

తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సీతారాంపూర్‌లో ఏర్పాటు చేసిన ఇండియాస్ నెక్స్‌జెన్ సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందని వివరించారు.

**యువతకు నైపుణ్యాలే బలం**

రాష్ట్రంలో ప్రతి ఏడాది లక్షకు పైగా ఇంజినీరింగ్ విద్యార్థులు పట్టాలు పొందుతున్నారని సీఎం తెలిపారు. వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలంటే పెద్ద ఎత్తున పరిశ్రమలు రావాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువతలో పెంపొందించేందుకు స్కిల్స్ యూనివర్సిటీతో పాటు అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు.

(వివరాలు 2లో..)





## బండి భగీరథ్‌కు హైకోర్టులో ఊరట

◆ షరతులతో బెయిల్ మంజూరు
◆ దర్యాప్తుకు సహకరించాలని ఆదేశం

పోక్సో కేసులో అరెస్టైన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టు ఊరట కల్పించింది. షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ దర్యాప్తుకు పూర్తిగా సహకరించాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. హైదరాబాద్‌లోని పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో మే 16న భగీరథ్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బెయిల్ పిటిషన్‌పై ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు గురువారం ఉత్తర్వులు వెలువరించింది. పిటిషనర్ తరఫు న్యాయవాది భగీరథ్ విద్యార్థి అని, 45 రోజులకు పైగా జైలులో ఉండటంతో తీవ్ర నష్టం జరిగిందని వాదించారు. పరస్పర అంగీకారంతో జరిగిన ఘటనపై కేసు నమోదు చేయడం చెల్లదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు, దర్యాప్తు కీలక దశలో ఉందని, బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన హైకోర్టు షరతులతో బెయిల్ మంజూరు చేసింది.

## ఇది కమీషన్ల ప్రభుత్వం

◆ రేవంత్ సర్కారుతో ప్రజలు విసిగిపోయారు
◆ రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్న హరీశ్ రావు

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు రైతులకు చేరుతున్నా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు. బీఆర్ఎస్‌పై రాజకీయంగా బురద చల్లడమే కాంగ్రెస్ లక్ష్యమని విమర్శించారు. సిద్దిపేటలో లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు.



2లో..

## కాంగ్రెస్ పని ముగిసింది

◆ రేవంత్ సర్వేలో తేలిపోయింది
◆ బీఆర్ఎస్‌కే ప్రజల మద్దతు
◆ ప్రజా వ్యతిరేకత స్పష్టమైందన్న కేటీఆర్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో పార్టీ నేతలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడిన ఆయన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేయించుకున్న సర్వేతో పాటు పలు ప్రజాభిప్రాయ సేకరణల్లో కూడా ఇదే విషయం వెల్లడైందని పేర్కొన్నారు.

(వివరాలు 2లో..)





## రూ.1,400 కోట్ల పార్టీ ఫండ్

### అమరుల కుటుంబాలకు ఇవ్వండి • బీఆర్ఎస్‌కు కవిత ఝలక్

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత బీఆర్ఎస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన బాయిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, బీఆర్ఎస్ పార్టీ ఖాతాలో ఉన్న రూ.1,400 కోట్లను తెలంగాణ అమరుల కుటుంబాలకు పంపిణీ చేసి నిజాయితీని నిరూపించాలని డిమాండ్ చేశారు. ఆ నిధులు క్విడ్ ప్రోకో ద్వారా వచ్చినవి కావా అని ప్రశ్నించారు. తనకు టీఆర్ఎస్ పేరు రాకుండా కుట్రలు జరుగుతున్నాయని, కాంగ్రెస్, బీజేపీ కలిసి తన పోరాటాలను ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. ఇకపై ఎట్టి పరిస్థితుల్లోనూ బీఆర్ఎస్‌లో చేరబోనని స్పష్టం చేశారు. ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు క్విడ్ ప్రోకో కింద అక్రమ అనుమతులు ఇచ్చారంటూ కేటీఆర్‌పై ఆరోపణలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో హరీశ్‌రావుపైనా విమర్శలు గుప్పించారు. అలాగే ఫీనిక్స్ సంస్థకు భారీ స్థాయిలో భూములు కేటాయించారంటూ ఆరోపణలు చేశారు.



3లో..

## పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో మంటలు

### పీఓకేలో ప్రజా ఉద్యమం ఉధృతం

పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో అసంతృప్తి తీవ్ర స్థాయికి చేరుకుంది. గత కొంతకాలంగా కొనసాగుతున్న ప్రజా నిరసనలు ఇప్పుడు పెద్ద ఉద్యమంగా మారుతున్నాయి. వేలాది మంది వీధుల్లోకి వచ్చి న్యాయం కోరుతున్నారు. ఆహారం, మందులు, విద్యుత్ వంటి ప్రాథమిక అవసరాల కొరతపై ప్రజల్లో ఆగ్రహం పెరిగింది. నిరసనలకు నాయకత్వం వహిస్తున్న పలువురిని పాకిస్థాన్ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ పరిస్థితుల్లో ఉద్యమ నాయకులు అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని వర్గాలు భారత్ జోక్యం చేసుకోవాలని కూడా కోరుతున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ పరిణామాలు పాక్ ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెంచుతున్నాయి.

## కొండంత పంచాయితీ



2లో..

◆ పార్టీ పెద్దల వద్దకు ఫిర్యాదులు
◆ ముదురుతున్న వరంగల్ లొల్లి
◆ శ్రీహరిని సంగతి తేల్చేస్తా
◆ మీనాక్షికి ఫిర్యాదు చేస్తానన్న సురేఖ

## హరీశ్‌రావుపై కేసీఆర్‌కు నమ్మకం లేదు



2లో..

◆ అందుకే మంత్రి పదవికి దూరం పెట్టారు
◆ హరీశ్‌రావుపై ఉత్తమ్ ఘాటు వ్యాఖ్యలు

## బీఆర్ఎస్ రైతులకేం చేసింది



2లో..

◆ కాంగ్రెస్ పార్టీతో పోల్చి చూడండి
◆ రైతులకు రూ.35 వేల కోట్లిచ్చాం
◆ అకారణంగా విమర్శిస్తున్నారన్న భట్టి

# ద్వైపాక్షిక బంధానికి కొత్త బలం

- రక్షణ, ఇంధనం, పెట్టుబడుల్లో దూకుడు
- మెల్‌బోర్న్ వేదికగా చారిత్రక నిర్ణయాలు
- ఇండో-పసిఫిక్‌పై భారత్-ఆస్ట్రేలియా ఫోకస్
- రక్షణ నుంచి యురేనియం వరకు 18 కీలక ఒప్పందాలు



ఇండోపసిఫిక్ ప్రాంతంలో వ్యూహాత్మక సమీకరణలు వేగంగా మారుతున్న వేళ భారత్, ఆస్ట్రేలియా తమ భాగస్వామ్యాన్ని మరో మెట్టు పైకి తీసుకెళ్లాయి. మెల్‌బోర్న్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ మధ్య జరిగిన శిఖరాగ్ర సమావేశంలో రక్షణ, పౌర అణుశక్తి, సముద్ర భద్రత, క్రిటికల్ మినరల్స్, ఇంధన భద్రత, సైబర్ టెక్నాలజీ, పెట్టుబడులు, విద్య వంటి కీలక రంగాల్లో 18 ఒప్పందాలు కుదిరాయి. ముఖ్యంగా ఆస్ట్రేలియా నుంచి భారత్‌కు యురేనియం సరఫరాకు మార్గం సుగమం కావడం ఈ పర్యటనలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రాంతీయ భద్రతతో పాటు ద్వైపాక్షిక ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలకు ఈ ఒప్పందాలు కొత్త ఊపు ఇవ్వనున్నాయని ఇరు దేశాల నాయకులు ప్రకటించారు.

భారత్, ఆస్ట్రేలియా సంబంధాలు మరో కీలక మలుపు తిరిగాయి. మెల్‌బోర్న్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ మధ్య జరిగిన శిఖరాగ్ర సమావేశంలో పౌర అణుశక్తి, రక్షణ,



సముద్ర భద్రత, క్రిటికల్ మినరల్స్, సైబర్ టెక్నాలజీ, పెట్టుబడులు, విద్య వంటి అనేక రంగాల్లో మొత్తం 18 కీలక ఒప్పందాలు కుదిరాయి. ఇండోపసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రత, స్థిరత్వాన్ని మరింత బలోపేతం చేయాలనే ఉమ్మడి లక్ష్యంతో ఇరు దేశాలు ఈ నిర్ణయాలు తీసుకున్నాయి. భవిష్యత్ వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఇవి కొత్త దిశ చూపనున్నాయని ఇరు దేశాల నాయకులు స్పష్టం చేశారు.

### యురేనియం సరఫరాకు మార్గం సుగమం

ఈ సమావేశంలో అత్యంత కీలకంగా నిలిచింది పౌర అణుశక్తి ఒప్పందం. ఈ ఒప్పందంతో ఆస్ట్రేలియా నుంచి భారత్‌కు వాణిజ్యపరంగా యురేనియం సరఫరా చేసే మార్గం అధికారికంగా తెరుచుకుంది. దేశంలో అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే లక్ష్యానికి ఇది కీలకంగా మారనుంది. 12 సంవత్సరాల క్రితం కుదిరిన పౌర అణుశక్తి సహకార ఒప్పందానికి ఇప్పుడు కార్యరూపం దక్కిందని అధికారులు తెలిపారు. స్వచ్ఛ ఇంధన లక్ష్యాల సాధనలో ఈ నిర్ణయం భారత్‌కు పెద్ద ఊతం ఇస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రక్షణ, భద్రతా సహకారంపై ఇరు దేశాలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. డిఫెన్స్ ఇన్నోవేషన్ కారిడార్ ద్వారా రెండు దేశాల రక్షణ స్టార్టప్‌లు, పరిశ్రమలను అనుసంధానం చేయాలని నిర్ణయించారు. సైనిక విన్యాసాలు విస్తరించడం, రక్షణ పరిశ్రమల్లో భాగస్వామ్యం పెంచడం, సాంకేతిక పరిజ్ఞానం పంచుకోవడం, సమాచార మార్పిడి బలోపేతం చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. 202829లో ఆస్ట్రేలియా డిఫెన్స్ కాలేజీలో భారత సైనిక శిక్షకుడిని నియమించాలని కూడా నిర్ణయించారు.

### క్రిటికల్ మినరల్స్‌పై ప్రత్యేక భాగస్వామ్యం

ఇండోపసిఫిక్ ప్రాంతంలో పెరుగుతున్న వ్యూహాత్మక సవాళ్లను దృష్టిలో ఉంచుకుని సముద్ర భద్రతా సహకార రోడ్‌మ్యాప్‌ను ఇరు దేశాలు ప్రకటించాయి. నౌకల నిర్మాణం, మరమ్మతులు, నిర్వహణ రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. భారత కోస్ట్ గార్డ్, ఆస్ట్రేలియా మారిటైమ్ బోర్డర్ కమాండ్ మధ్య ప్రత్యేక ఒప్పందం కుదిరింది. సముద్ర చట్టాల అమలు, సముద్ర సరిహద్దుల భద్రత, నిఘా వ్యవస్థల బలోపేతంలో ఈ ఒప్పందం కీలకంగా మారనుంది. భవిష్యత్ సాంకేతిక రంగాలకు అవసరమైన క్రిటికల్ మినరల్స్ సరఫరాలో పరస్పర సహకారం పెంచాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. సైబర్ భద్రత, కీలక సాంకేతిక రంగాలు, సరఫరా వ్యవస్థల బలోపేతానికి ప్రత్యేక భాగస్వామ్యాన్ని ప్రారంభించాయి. క్రిటికల్ మినరల్స్ కారిడార్ ఏర్పాటుపై కలిసి పనిచేయనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ చర్యలు స్వచ్ఛ ఇంధన రంగంతో పాటు వ్యూహాత్మక భద్రతను కూడా మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.

### వాణిజ్య ఒప్పందానికి వేగం

2022లో కుదిరిన ఆర్థిక సహకార, వాణిజ్య ఒప్పందం మంచి ఫలితాలు ఇస్తోందని ఇరు దేశాలు అభిప్రాయపడ్డాయి. ఇప్పుడు సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందం (సీఈసీఏ) పనులను వేగవంతం చేయాలని నిర్ణయించాయి. ద్వైపాక్షిక పెట్టుబడి రక్షణ ఒప్పందాన్ని కూడా త్వరగా పూర్తి చేయాలని అంగీకరించాయి. భారత్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రేలియా కంపెనీలను ప్రధాని మోదీ ఆహ్వానించారు. విద్యా రంగంలో కూడా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గురుగ్రామ్‌లో విక్టోరియా యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటు చేయడానికి అనుమతి పత్రాన్ని భారత్ అందించింది. బెంగళూరులో క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు ఫ్లిండర్స్ యూనివర్సిటీకి ఉద్దేశపత్రం జారీ చేసింది. ఉన్నత విద్య, పరిశోధన, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలకు ఈ నిర్ణయాలు కొత్త అవకాశాలు కల్పించనున్నాయి.

### భారత్-ఆస్ట్రేలియా బంధానికి కొత్త దశ

ఉగ్రవాదం ఒక్క దేశానికే కాదు, ప్రపంచానికే పెద్ద ముప్పని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ సవాల్‌ను ఎదుర్కొనే విషయంలో ఇరు దేశాల సంకల్పం దృఢంగా ఉందని చెప్పారు. ప్రపంచంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు యుద్ధం కాదు, చర్చలే పరిష్కారమని అభిప్రాయపడ్డారు. ఇండోపసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్వేచ్ఛాయుత నౌకాయానం, అంతర్జాతీయ నిబంధనల ఆధారిత వ్యవస్థను బలోపేతం చేయడానికి కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు. భారత్‌తో సంబంధాలు గతంలో ఎన్నడూ లేనంత బలంగా ఉన్నాయని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ పేర్కొన్నారు. ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యం ప్రతి రంగంలో విస్తరిస్తోందని చెప్పారు. రక్షణ, అణుశక్తి, సముద్ర భద్రత, విద్య, విజ్ఞానం, ఇంధనం, క్రిటికల్ మినరల్స్ రంగాల్లో కుదిరిన ఒప్పందాలు ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనతో ఇండోపసిఫిక్ ప్రాంతంలో భారత్ ఆస్ట్రేలియా భాగస్వామ్యానికి కొత్త అధ్యాయం ప్రారంభమైనట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

# తెలంగాణలో భవిష్యత్ బీజేపీదే

- బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో ప్రజలు విసిగిపోయారు
- ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్న జేపీ నడ్డా



తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా విమర్శించారు. హైదరాబాద్ పర్యటన సందర్భంగా రాష్ట్ర నాయకులతో సమావేశమైన ఆయన, ఇతర పార్టీల నేతలు బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ విభేదాలు పక్కనపెట్టి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలతో సన్నిహితంగా ఉంటేనే పార్టీ బలపడుతుందని సూచించారు.

### రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు

మేధావుల సమావేశంలో మాట్లాడిన నడ్డా, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అవినీతి జరిగిందని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తరహా పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టును గత ప్రభుత్వం ఏటీఎంలా ఉపయోగించుకుందని, ఇప్పుడు సంక్షేమ పథకాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. తెలంగాణకు కేంద్రం భారీగా నిధులు, జాతీయ రహదారులు, విద్యుత్ ప్రాజెక్టులు, ఎయిమ్స్ వంటి అభివృద్ధి కార్యక్రమాలు అందించిందని పేర్కొన్నారు.

### మోదీ పాలనలో వైద్య రంగం అభివృద్ధి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ వైద్య రంగం గణనీయంగా అభివృద్ధి చెందిందని నడ్డా అన్నారు. గతంలో దేశంలో ఒకే ఎయిమ్స్ ఆసుపత్రి ఉండేదని, ప్రస్తుతం 23 ఎయిమ్స్ ఆసుపత్రులు ఏర్పాటయ్యాయని తెలిపారు. అందులో 18 ఇప్పటికే ప్రజలకు సేవలందిస్తున్నాయని చెప్పారు. అలాగే దేశవ్యాప్తంగా లక్షా 75 వేలకుపైగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. మెడికల్ కళాశాలల సంఖ్యను 370 నుంచి 820కి పెంచి వైద్య విద్యను విస్తరించామని చెప్పారు. సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నడ్డా స్పష్టం చేశారు.

# ఇది కమీషన్ల ప్రభుత్వం

- రేవంత్ సర్కారుతో ప్రజలు విసిగిపోయారు
- రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్న హరీశ్ రావు




కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు రైతులకు చేరుతున్నా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు. బీఆర్ఎస్‌పై రాజకీయంగా బురద చల్లడమే కాంగ్రెస్ లక్ష్యమని విమర్శించారు. సిద్దిపేటలో లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు.

### కమిషన్ల ప్రభుత్వమని ఆరోపణ

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి అంశంలో కమిషన్లకే ప్రాధాన్యం ఇస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. గురుకులాల్లో కోడిగుడ్లు, బూట్లు, యూనిఫాంల కొనుగోళ్ల నుంచి రవాణా శాఖలో రేడియం స్టిక్కర్ల వరకు ప్రతిచోటా ప్రజలపై అదనపు భారం మోపుతున్నారని విమర్శించారు. గతంలో తక్కువ ఖర్చుతో పూర్తయ్యే పనులకు ఇప్పుడు వేల రూపాయలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు ఈ పరిస్థితిని గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వానికే అవకాశం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

### ఆరోగ్య సేవలకు సహకారం

ఈ సందర్భంగా లారీ డ్రైవర్లు, సిబ్బంది ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని హరీశ్‌రావు కోరారు. అవసరమైన వారికి తన సొంత నిధులతో కళ్లద్దాలు, అవసరమైతే కంటి శస్త్రచికిత్సలు కూడా చేయిస్తానని హామీ ఇచ్చారు. లారీ అసోసియేషన్‌కు పార్కింగ్ స్థలం కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, నిత్యం వాకింగ్, యోగా వంటి అలవాట్లు పెంచుకోవాలని సూచించారు.



# కాంగ్రెస్ పని ముగిసింది

- రేవంత్ సర్వేలో తేలిపోయింది
- బీఆర్ఎస్‌కే ప్రజల మద్దతు
- ప్రజా వ్యతిరేకత స్పష్టమైందన్న కేటీఆర్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో పార్టీ నేతలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడిన ఆయన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేయించుకున్న సర్వేతో పాటు పలు ప్రజాభిప్రాయ సేకరణల్లో కూడా ఇదే విషయం వెల్లడైందని పేర్కొన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ సుమారు 78 స్థానాలు గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆయా సర్వేల్లో తేలిందని చెప్పారు. మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారని కేటీఆర్ అన్నారు. అయితే ఈ సర్వేల వివరాలను ఆయన బహిరంగంగా వెల్లడించలేదు.

### ప్రభుత్వంపై విమర్శలు

ప్రభుత్వం ఇచ్చిన హామీలు, గ్యారంటీల అమలులో విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని దారి మళ్లించేందుకే కాళేశ్వరం, రైతు బంధు వంటి అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా మద్దతు కోల్పోయిందని, తెలంగాణలో బీఆర్ఎస్‌నే ప్రజలు ప్రత్యామ్నాయంగా చూస్తున్నారని అన్నారు.

### ఎస్ఐఆర్‌పై ప్రత్యేక దృష్టి

జీహెచ్ఎంసీ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంపై పార్టీ నేతలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కేటీఆర్ సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ మందగించిందని, ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. పార్టీ కార్యకర్తల సహకారంతో ప్రతి అర్హుడి ఓటు నమోదయ్యేలా చూడాలని, దొంగ ఓట్లు, డబుల్ ఓట్లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటర్ల హక్కులు కాపాడే విషయంలో ప్రతి నాయకుడు బాధ్యతగా వ్యవహరించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

# 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల తెలంగాణ

**అభివృద్ధి బ్లూప్రింట్ ప్రకటించిన సీఎం రేవంత్**

తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సీతారాంపూర్‌లో ఏర్పాటు చేసిన ఇండియాస్ నెక్స్‌జెన్ సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందని వివరించారు.

### యువతకు నైపుణ్యాలే బలం

రాష్ట్రంలో ప్రతి ఏడాది లక్షకు పైగా ఇంజినీరింగ్ విద్యార్థులు పట్టాలు పొందుతున్నారని సీఎం తెలిపారు. వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలంటే పెద్ద ఎత్తున పరిశ్రమలు రావాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువతలో పెంపొందించేందుకు స్కిల్స్ యూనివర్సిటీతో పాటు అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు.

### హైదరాబాద్‌కు కాలుష్యరహిత భవిష్యత్

హైదరాబాద్‌ను భవిష్యత్తులో కాలుష్య సమస్య నుంచి కాపాడేందుకు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ప్రస్తుతం ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో 1.34 కోట్ల మంది నివసిస్తున్నారని చెప్పారు. నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు ఓఆర్ఆర్ లోపల ఉన్న పరిశ్రమలను దశలవారీగా వెలుపలకు తరలించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. పెరి అర్బన్ ప్రాంతాల్లో ప్రత్యేక తయారీ పరిశ్రమల జోన్లు ఏర్పాటు చేసి పారిశ్రామిక అభివృద్ధిని విస్తరిస్తామని పేర్కొన్నారు.

### పెట్టుబడులు, మౌలిక సదుపాయాలపై దృష్టి

ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించాలంటే అత్యుత్తమ మౌలిక సదుపాయాలు అవసరమని సీఎం అన్నారు. బుద్వేల్ నుంచి కొడంగల్ వరకు 100 మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మాణం కొనసాగుతోందని తెలిపారు. రాష్ట్రాన్ని సమతుల అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణ



అమలు చేస్తున్నామని చెప్పారు. రాజకీయ విమర్శలు సహజమేనని, అయితే అభివృద్ధి విషయంలో అందరూ సహకరించాలని ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశారు.

### రైతుల త్యాగాలకు గుర్తింపు

సీతారాంపూర్‌లో పరిశ్రమ ఏర్పాటుకు భూములు ఇచ్చిన కుటుంబాలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని, ఉపాధి కోసం వ్యాపార సముదాయాలు నిర్మించాలని జిల్లా అధికారులను సీఎం ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా ప్రజల త్యాగాల వల్లే పారిశ్రామిక అభివృద్ధి సాధ్యమైందని కొనియాడారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సహకారంతో తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# కొండంత పంచాయితీ

- పార్టీ పెద్దల వద్దకు ఫిర్యాదులు
- ముదురుతున్న వరంగల్ లొల్లి
- శ్రీహరి సంగతి తేల్చేస్తా
- మీనాక్షికి ఫిర్యాదు చేస్తానన్న సురేఖ



ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నేతల మధ్య విభేదాలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య నెలకొన్న విభేదాలు ఇప్పుడు టీపీసీసీ దృష్టికి చేరాయి. దేవాదాయ శాఖకు సంబంధించిన అంశాలపై తనకు సమాచారం ఇవ్వకుండా కడియం శ్రీహరి సమీక్ష సమావేశం నిర్వహించారని కొండా సురేఖ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ విషయంపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆమె వెల్లడించారు. మంత్రి చేయాల్సిన పనుల్లో ఎమ్మెల్యే జోక్యం చేసుకోవడం సరికాదని ప్రశ్నించారు. మూడు నెలలుగా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని కూడా ఆరోపించారు. ఈ వివాదాన్ని సామరస్యంగా పరిష్కరిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ హామీ ఇచ్చారు. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా ఎవరూ వ్యవహరించరాదని హెచ్చరించారు. ఇదిలా ఉండగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంత్రి పనితీరుపై కూడా కాంగ్రెస్‌లోని కొందరు నేతల్లో అసంతృప్తి ఉందన్న చర్చ సాగుతోంది. ఈ వివాదంపై ఈ నెల 14న తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌ను కలుస్తానని మంత్రి కొండా సురేఖ తెలిపారు.

# హరీశ్‌రావుపై కేసీఆర్‌కు నమ్మకం లేదు

- అందుకే మంత్రి పదవికి దూరం పెట్టారు
- హరీశ్‌రావుపై ఉత్తమ్ ఘాటు వ్యాఖ్యలు

ఇరిగేషన్ అంశంపై మాజీ మంత్రి హరీశ్‌రావుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. హరీశ్‌రావు ఇరిగేషన్‌లో నిష్ణాతుడైతే, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకు మంత్రి పదవి నుంచి తొలగించారని ప్రశ్నించారు. హరీశ్‌రావుపై కేసీఆర్‌కు నమ్మకం లేకనే మంత్రివర్గం నుంచి దూరం పెట్టారని విమర్శించారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడిన ఉత్తమ్, హరీశ్‌రావు వ్యాఖ్యలకు తగిన సమయంలో పూర్తి స్థాయిలో సమాధానం ఇస్తామని చెప్పారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు వచ్చే వేసవిలోపు పూర్తవుతాయని వెల్లడించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో వచ్చే వేసవి వరకు రిపేర్లు పూర్తి అవుతాయని తెలిపారు. బ్యారేజీలో డ్యామేజీల మరమ్మతులు చేయడానికి తాము చిత్తశుద్ధితో పని చేస్తున్నామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు తనకు మంత్రి పదవి ఇవ్వాలని అంటున్నారని.. కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి చెప్పినట్లుగా హరీశ్‌రావు తమ పార్టీలో చేరుతారా? అని ప్రశ్నించారు. హరీశ్‌రావు వ్యాఖ్యలపై సరైన సమయంలో సవివరంగా తాము సమాధానం చెబుతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మరోవైపు ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ఉత్తమ్ తెలిపారు. జిల్లాల వారీగా కార్యాచరణ చేపట్టామని, గ్రామసభల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. శాస్త్రవేత్తల సూచనల మేరకు పంటల ఎంపిక, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ పంటలపై సలహాలు అందిస్తామని వెల్లడించారు. రిజర్వాయర్ల నీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షిస్తామని, ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వదంతులను నమ్మకుండా అధికారుల సూచనలు పాటించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ రైతులకేం చేసింది



- కాంగ్రెస్ పార్టీతో పోల్చి చూడండి
- రైతులకు రూ.35 వేల కోట్లిచ్చాం
- అకారణంగా విమర్శిస్తున్నారన్న భట్టి

వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం లచ్చగూడెంలో పర్యటించిన ఆయన రైతు ఆశీర్వాద సభ ఏర్పాట్లను పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలోనే రైతులకు రూ.35 వేల కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందించిందని తెలిపారు. రైతు భరోసా పథకం కింద కేవలం తొమ్మిది రోజుల్లో ఎనిమిది ఎకరాల వరకు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో రూ.8,759 కోట్లు జమ చేశామని వెల్లడించారు. మరో రూ.1,900 కోట్లను తొమ్మిది నుంచి 50 ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వంపై భట్టి విమర్శలు చేశారు. పదేళ్ల పాలనలో రైతు భరోసాకు రూ.75 వేల కోట్లు ఖర్చు చేసినా పంట నష్టపోయిన రైతులకు క్రాప్ డ్యామేజ్ పేరుతో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రైతుల కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ మాత్రమేనని స్పష్టం చేశారు. రైతు ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్నట్లు తెలిపారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# సింగరేణికి కేంద్రం భరోసా

- కొత్త బొగ్గు బ్లాక్‌లతో ₹ 2.25 లక్షల కోట్ల టర్నోవర్
- వెల్లడించిన బొగ్గు గనుల మంత్రి కిషన్ రెడ్డి

కేంద్ర ప్రభుత్వం సింగరేణి భవిష్యత్తుకు బలమైన భరోసా కల్పించిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ తాడిచర్ల 2, నైనీ కోల్ బ్లాక్‌ల కేటాయింపుతో సింగరేణికి మరో 45 ఏళ్లపాటు ఇంధన భద్రత లభిస్తుందని చెప్పారు. ఈ రెండు గనుల్లో కలిపి 795 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని, వీటి ద్వారా సుమారు రూ.2.25 లక్షల కోట్ల టర్నోవర్ సాధ్యమవుతుందని వెల్లడించారు. తాడిచర్ల గనిలో 2,000 మందికి పైగా కార్మికులకు దీర్ఘకాలిక ఉపాధి లభిస్తుందని, రెండు బ్లాక్‌లతో కలిపి 3,500 కొత్త ఉద్యోగాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. రైల్వే, రహదారి మౌలిక వసతులు కూడా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. సింగరేణి తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని, సంస్థను బలోపేతం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.54,148 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసిన కిషన్ రెడ్డి, రాజకీయాలకు అతీతంగా సంస్థ ప్రయోజనాల కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.



# పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో మంటలు

## పీఓకేలో ప్రజా ఉద్యమం ఉధృతం

**పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో అసంతృప్తి తీవ్ర స్థాయికి చేరుకుంది. గత కొంతకాలంగా కొనసాగుతున్న ప్రజా నిరసనలు ఇప్పుడు పెద్ద ఉద్యమంగా మారుతున్నాయి. వేలాది మంది వీధుల్లోకి వచ్చి న్యాయం కోరుతున్నారు. ఆహారం, మందులు, విద్యుత్ వంటి ప్రాథమిక అవసరాల కొరతపై ప్రజల్లో ఆగ్రహం పెరిగింది. నిరసనలకు నాయకత్వం వహిస్తున్న పలువురిని పాకిస్థాన్ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ పరిస్థితుల్లో ఉద్యమ నాయకులు అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని వర్గాలు భారత్ జోక్యం చేసుకోవాలని కూడా కోరుతున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ పరిణామాలు పాక్ ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెంచుతున్నాయి.**

**'ఆజాద్ కశ్మీర్'పై ప్రశ్నలు**

పాకిస్థాన్ "ఆజాద్ కశ్మీర్"గా పేర్కొనే ప్రాంతంలో నిజంగా స్వయం పాలన ఉందా అనే ప్రశ్న మళ్లీ తెరపైకి వచ్చింది. స్థానిక ప్రభుత్వానికి పరిమిత అధికారాలే ఉన్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధాన నిర్ణయాలు ఇస్లామాబాద్ ఆధీనంలోనే ఉంటున్నాయని ఉద్యమకారులు ఆరోపిస్తున్నారు. 2023లో ఏర్పడిన జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజలు తమ డిమాండ్లను బలంగా వినిపిస్తున్నారు. విద్యుత్ చార్జీలు తగ్గించడం, పన్నుల భారం తగ్గించడం, స్థానిక ప్రజలకు హక్కులు కల్పించడం, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత వంటి అంశాలను వారు ప్రధానంగా లేవనెత్తుతున్నారు. ఈ ఉద్యమానికి ఉపాధ్యాయులు, ఉద్యోగులు, వ్యాపారులు, రైతులు కూడా మద్దతు ఇస్తున్నట్లు సమాచారం.

**• రాజకీయ వ్యవస్థపై విమర్శలు**

పీఓకే అసెంబ్లీలో రిజర్వు స్థానాల విధానంపైనా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికంగా నివసించని శరణార్థులకు కేటాయించిన స్థానాల వల్ల ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతింటోందని ఉద్యమకారులు అంటున్నారు. స్థానిక ప్రజల ఓటు విలువ తగ్గుతోందని ఆరోపిస్తున్నారు. రాజ్యాంగ సవరణల ద్వారానే ఈ వ్యవస్థలో మార్పులు సాధ్యమని న్యాయ నిపుణులు చెబుతున్నారు. అయితే ఆ నిర్ణయం కూడా పాకిస్థాన్ ప్రభుత్వ ఆమోదంపై ఆధారపడటంతో సమస్య మరింత క్లిష్టంగా మారింది. ప్రజల డిమాండ్లపై ఇస్లామాబాద్ ఇప్పటికీ స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం అసంతృప్తిని పెంచుతోంది.

**• ఆర్థిక సమస్యలే ఆగ్రహానికి కారణం**

పీఓకేలో విద్యుత్ ఉత్పత్తికి కీలకమైన జలవనరులు ఉన్నప్పటికీ స్థానిక ప్రజలు తరచూ విద్యుత్ కోతలను ఎదుర్కొంటున్నారు. మంగ్లా డ్యాం నిర్మాణంతో భూములు కోల్పోయిన వేలాది కుటుంబాలకు పూర్తి న్యాయం జరగలేదని ఆరోపణలు ఉన్నాయి. మెరుగైన ఆసుపత్రులు, విమానాశ్రయం, రహదారులు, విద్యుత్ మౌలిక సదుపాయాల కోసం కూడా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆర్థిక అసమానతలు, అభివృద్ధి లోపం ఉద్యమాన్ని మరింత బలపరిచాయి. పశ్తూన్, బలూచ్ ప్రాంతాల నుంచి కూడా సంఘీభావం వ్యక్తమవుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. దీంతో ఈ ఉద్యమం పాకిస్థాన్‌కు విస్తృత రాజకీయ సవాలుగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**• భారత్‌కు ఎదురవుతున్న సవాళ్లు**

ఈ పరిణామాల మధ్య భారత్ పరిస్థితి కూడా సున్నితంగా మారింది. పీఓకేను భారత భూభాగంలో భాగంగా భారత్ అధికారికంగా భావిస్తోంది. అదే సమయంలో ప్రత్యక్ష జోక్యం ప్రాంతీయ ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం కూడా ఉంది. మానవతా సహాయం అందించాలా, అంతర్జాతీయ వేదికల్లో అంశాన్ని ప్రస్తావించాలా అనే చర్చలు నిపుణుల్లో కొనసాగుతున్నాయి. మరోవైపు ఈ సంక్షోభాన్ని సరిహద్దు ఉద్రిక్తతగా మార్చే ప్రయత్నాలు పాకిస్థాన్ చేయవచ్చనే ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. అందుకే పరిస్థితిని నిశితంగా గమనిస్తూ వ్యూహాత్మకంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం పీఓకేలో నెలకొన్న పరిస్థితులు పాకిస్థాన్ అంతర్గత పాలనపైనా, ప్రాంతీయ భద్రతపైనా కీలక ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# రాశి ఫలితాలు

## 10.07.2026 శుక్రవారం

**మేష రాశి :** మిత్రుల ద్వారా పనులు పూర్తి చేస్తారు. కళా రంగ ం ఇన్సూరెన్స్ రంగాల వారికి ఆర్థిక అభివృద్ధి. ముష్టాన్న భోజనము చేస్తారు. పెళ్లిచూపులు భజంత్రీలు మోగేదాకా వెళతాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. గృహిణులు మీ ప్రేమానురాగాలతో కుటుంబ సభ్యులను మెప్పిస్తారు.

**వృషభ రాశి :** ప్రతి చిన్న విషయానికి భావావేశం కు గురి కావద్దు. విద్యార్థులు శ్రద్ధగా అభ్యాసం చేయగలరు. డ్రైవింగ్ స్పీడ్ తగ్గించాల. వేడి చేసే ఆహార పదార్థాలను తక్కువగా తీసుకోగలరు. హుందాగా వ్యవహరిస్తే గౌరవం పెరుగుతుంది. స్త్రీలకు ఇంట్లో పని భారం పెరిగింది.

**మిథున రాశి :** క్రయవిక్రయాలు సామాన్యంగా ఉన్నాయి. ఖర్చులు నియంత్రించుకోగలరు. సోలార్ ఎనర్జీ వ్యాపారస్తులకు సుదినం. త్రిబుల్ ఈ విద్యను అభ్యసించే విద్యార్థులకు అనుకూలం. ఉద్యోగస్తులు చేయని తప్పుకి నిందను మోయాల్సిన ఆస్కారం ఉంది. మారేడు మొక్కని నాటి సంరక్షించగలరు. శ్రీ సూక్త పారాయణ లక్ష్మీప్రదం.

**కర్కాటక రాశి:** వ్యాపార భాగస్తులు సఖ్యతతో లాభార్జన చేస్తారు. సినీ పరిశ్రమకు అనుకూలం. రియల్ ఎస్టేట్, ట్రాన్స్‌పోర్ట్ రంగాల వారికి అనుకూలం. స్త్రీలు ఓర్పుగా మెలగాలి. అన్ని రంగాలలో ఉన్న వారికి ఎలినోవా ఉన్నప్పటికీ వర్షం కురిసినంత ఆనందం, లాభం కలుగుతుంది.

**సింహరాశి:** వ్యాపారస్తులు ఇతరులపై ఆధారపడితే నష్టానికి కూడా ఆస్కారం ఉంది. కుటుంబానికి దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. ప్రణాళికలను అమలు చేయలేని పరిస్థితి ఏర్పడవచ్చు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించగలరు. అత్యాశకు పోతే నష్టం రావచ్చు సుమా! సూర్యుడికి నమస్కరించటం సూర్యాష్టక పారాయణ వలన మేలు జరుగుతుంది.

**కన్యారాశి :** ఆహార నియమాలు పాటించగలరు. స్వల్ప ఆదాయం. ఉద్యోగస్తులు పని భారాన్ని ఓర్పుగా నిర్వహించాలి. వ్యాపారస్తులకు రాని బాకీల బెడద తప్పదు. భార్యాభర్తలు సఖ్యతను పెంచుకోవాలి. విద్యార్థులు మితంగా మాట్లాడగలరు. అశోక మొక్కను నాటి సంరక్షించగలరు. పెసలు దానం వలన మేలు జరుగుతుంది.

**తులారాశి :** అనుకున్న పని సాధించే నిమిత్తమై కఠోర శ్రమతో విజయాన్ని సాధిస్తారు. మిత్రుల కలయిక సంతోషాన్నిస్తుంది. ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించగలరు. ఒకటికి రెండు సార్లు ఆలోచించి నిర్ణయాలు తీసుకోగలరు. తండ్రి ఆరోగ్యం పై శ్రద్ధ వహించగలరు. నవగ్రహ ప్రదక్షిణ గ్రహదోష తీవ్రతను తగ్గించగలదు.

**వృశ్చిక రాశి:** ఉద్యోగస్తుల హవా నేడు కనబడుతుంది. అవసరమైన వారికి దానధర్మాలు చేస్తారు. సినీ రంగంలో వారికి నూతన పరిచయాలు ఏర్పడతాయి. నూతన వాహనం తీసుకోవాలనే భావన కలుగుతుంది. గోమాతకు సేవ చేయాలనే తపన ఉంటుంది. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దర్శనం మేలు చేస్తుంది.

**ధనస్సు రాశి :** మొండితనానికి పోవద్దు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి. ఆదాయాన్ని బట్టి ఖర్చు చెయ్యాలనే భావనను మర్చిపోవద్దు. నిరుద్యోగులకు నిరాశాజనకమే. బంధు వర్గాలతో సఖ్యతను పెంచుకోవాలి. వ్యాపారస్తులకు కొద్దిపాటి చికాకులు ఉంటాయి. మామిడి మొక్క నా టి సంరక్షించగలరు. రావి చెట్టు ప్రదక్షణ గ్రహదోష తీవ్రతను తగ్గించగలదు.

**మకర రాశి:** బంధుమిత్రులతో లౌక్యంగా మాట్లాడగలరు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు సామాన్యంగా ఉంది. ఈర్ష్యా ద్వేషాలను పక్కన పెట్టకపోతే నష్టపోతారు. నిడారంబరంగా ఉంటూ ఇతరుల విషయాల జోలికి వెళ్లకపోవడం మంచిది. విద్యార్థులు తల్లి సేవ చేయటం వలన గ్రహదోష తీవ్రత తగ్గును.

**కుంభరాశి :** ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. గృహము కొనుగోలు చేసే ఆస్కారం ఉంది. ఆకస్మిక ప్రయాణాలకు ఆస్కారం. పోటీ పరీక్షల ఫలితాలు సంతోషాన్ని స్థాయి. ఆర్థిక అభివృద్ధి.కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతారు. పాత స్నేహితుల కలయిక ఆనందాన్నిస్తుంది.


**మీన రాశి :** కీలకమైన విషయాల యందు తొందర పడవద్దు. బంగారము వెండి వంటి వాటిపై భద్రత అవసరం. మితంగా మాట్లాడగలరు. ఇరుగు పొరుగు వారితో సఖ్యతగా మే లగాలి. స్త్రీలతో మీ ప్రవర్తన చేటు చేయవచ్చు. మహాలక్ష్మి అష్టకాన్ని పారాయణ చేయడం వలన శుభం కలుగుతుంది.



*టీటీడీ అనుబంధ సంస్థ*
*సమరసత సిద్ధాంతి*
*'దైవజ్ఞ ' పులిపాక చంద్రశేఖర శర్మ*
*శ్రీ చక్ర పంచాంగ కర్త 9440783005*

# చైనా వరదల్లో పాముల దండు

- **వరదల్లో 900 విషసర్పాల కలకలం**



చైనాలో భారీ వరదలు మరో భయంకర పరిస్థితికి తెరలేపాయి. గ్వాంగ్సీ ప్రాంతంలో వరదల ధాటికి పాముల పెంపక కేంద్రాలు ధ్వంసం కావడంతో 900కు పైగా పాములు బయటకు వచ్చాయి. వీటిలో నాగుపాములు వంటి విషసర్పాలు కూడా ఉండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వరద నీటిలో పాములు ఈదుకుంటూ తిరుగుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. పాము కాటుకు గురైన ఓ మహిళ వరదల కారణంగా ఆస్పత్రికి ఆలస్యంగా చేరడంతో ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. పలువురు పాము కాటుకు చికిత్స పొందుతున్నారు. పాములను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించిన చైనా అధికారులు తాత్కాలిక వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు చేశారు. గ్వాంగ్సీ ప్రాంతంలో సుమారు మూడు కోట్ల పాములను ఔషధాలు, తోలు ఉత్పత్తులు, మాంసం కోసం పెంచుతుంటారు. వరదలతో గ్రామాలు నీటమునిగిపోవడంతో పాములు జనావాసాల్లోకి చేరుతున్నాయి. ఇప్పటికే ఆరు మంది ప్రాణాలు కోల్పోగా, లక్షా ముప్పై వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వేలాది సహాయక సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. వరదలతో పాములు మాత్రమే కాదు, జూలోని జంతువులు కూడా బయటకు రావడంతో గ్వాంగ్సీ ప్రాంతం భయంతో వణికిపోతోంది.

# అమరావతిలో అవినీతి జోరు

- **మావిగన్‌తోనే అభివృద్ధి సాధ్యం**
- **మాజీ మంత్రి సాకే శైలజానాథ్**




అమరావతి నిర్మాణాల పేరుతో కూటమి ప్రభుత్వం వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ఆరోపించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మంత్రి నారాయణ వ్యాఖ్యలు వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నమని విమర్శించారు. గతంలో టెండర్లు పొందిన కంపెనీలకే ఇప్పుడు పనులు అప్పగించినా నిర్మాణ వ్యయాన్ని భారీగా పెంచడం వెనుక కారణమేంటో ప్రభుత్వం ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. 2017-18లో రూ.2,271 కోట్లతో ఖరారైన నిర్మాణాల అంచనా వ్యయం ఇప్పుడు రూ.4,354 కోట్లకు పెరగడం అవినీతికి నిదర్శనమని అన్నారు. చదరపు అడుగుకు అమరావతిలో చూపుతున్న వ్యయం దేశంలోని ముంబయి, బెంగళూరు వంటి నగరాల్లో కూడా లేదని పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రశ్నిస్తే వైఎస్సార్‌సీపీ అమరావతికి వ్యతిరేకమని ప్రచారం చేయడం సరైన విధానం కాదన్నారు.

**అదనపు ఖర్చులే ఎక్కువ**

అమరావతి పేరుతో గ్లాస్ ఫసాడ్లు, డిజైన్లు, విద్యుత్, ప్లంబింగ్ పనుల పేరిట వేల కోట్లు ఖర్చు చూపుతున్నారని శైలజానాథ్ విమర్శించారు. నిర్మాణ వ్యయం కంటే అదనపు పనుల ఖర్చే ఎక్కువగా ఉండటం ఆశ్చర్యకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న భవనాలతో పోలిస్తే రాష్ట్ర ప్రభుత్వం చదరపు అడుగుకు అనూహ్యంగా అధిక వ్యయం చేస్తోందని ఆరోపించారు. రాజధాని పేరుతో కాంట్రాక్టర్లకు లాభాలు చేకూర్చే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని, ప్రజల డబ్బును వృథా చేస్తున్నారని అన్నారు. అమరావతి కోసం ఇప్పటికే భారీగా అప్పులు చేస్తున్న ప్రభుత్వం భవిష్యత్తులో మరింత ఆర్థిక భారం మోపే పరిస్థితి తీసుకొస్తోందని విమర్శించారు.

**మావిగన్‌పై ప్రజల్లో చర్చ**

రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి జగన్ ప్రతిపాదించిన మావిగన్ రాజధానియే సరైన మార్గమని శైలజానాథ్ స్పష్టం చేశారు. మచిలీపట్నం నుంచి గుంటూరు వరకు విస్తరించిన ప్రాంతంలో అంతర్జాతీయ విమానాశ్రయం, రైల్వే, రహదారి సదుపాయాలతో అభివృద్ధి వేగంగా సాధ్యమవుతుందన్నారు. అభివృద్ధిని ఒకే ప్రాంతంలో కేంద్రీకరించడం వల్ల రాష్ట్రానికి ప్రయోజనం ఉండదని, వికేంద్రీకరణ ద్వారానే అన్ని ప్రాంతాలు సమానంగా ఎదుగుతాయని చెప్పారు. అమరావతి కోసం ఖర్చు చేస్తున్న నిధుల్లో కొంత భాగాన్ని రాయలసీమ, ఉత్తరాంధ్ర పెండింగ్ ప్రాజెక్టులకు కేటాయిస్తే ప్రజలకు ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని సూచించారు. ప్రజల మద్దతు మావిగన్‌కే ఉందని, ప్రభుత్వం ఇప్పటికైనా కేంద్రీకరణ విధానాన్ని విరమించి ప్రజల అవసరాలకు అనుగుణంగా రాజధాని అభివృద్ధిపై నిర్ణయం తీసుకోవాలని శైలజానాథ్ కోరారు.



# దేశాయిపేటలో ఘోరం..

**భార్యను చార్జింగ్ వైరుతో ఉరివేసి చంపిన భర్త**

**అనుమానంతో నిత్యం వేధింపులు.. అడ్డువచ్చినందుకు దారుణ హత్య**

**కూతురిని పనికి వెళ్లాలని వేధించడంతో దంపతుల మధ్య ఘర్షణ**

**వేటపాలెం, జులై 09(నాదేశం) :** వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ కప్పలదొడ్డి కాలనీలో గురువారం తెల్లవారుజామున ఒక దారుణ హత్య ఉదంతం వెలుగుచూసింది. అనుమానంతో భర్త తన భార్య గొంతుకు చార్జింగ్ వైరు బిగించి అత్యంత కిరాతకంగా హతమార్చాడు.
కప్పలదొడ్డి కాలనీలో నివాసముంటున్న అన్నపురెడ్డి వీరమ్మ అలియాస్ షేక్ ఆశా (38)కు గతంలో వివాహమై ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సుమారు 14 ఏళ్ల క్రితం మొదటి భర్త చనిపోవడంతో, ఆమె వేటపాలెం రామనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ రఫీని రెండో వివాహం చేసుకుంది. వీరికి ఒక కుమారుడు జన్మించాడు. అయితే, రఫీ నిత్యం మద్యం తాగి ఇంటికి వస్తూ, భార్య ఆశకు అక్రమ సంబంధాలు అంటగడుతూ శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. అంతేకాకుండా, ఆశ మొదటి భర్తకు పుట్టిన కుమార్తె అన్నపురెడ్డి ఉమా వెంకటలక్ష్మిని, తన కొడుకు షేక్ షారుక్‌ను కూడా తరచూ కొడుతూ, తిడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో ఆశ మొదటి కుమార్తె ఉమా వెంకటలక్ష్మిని పనికి వెళ్లాలంటూ రఫీ కొంతకాలంగా వేధిస్తున్నాడు. దీనికి తల్లి ఆశ ఒప్పుకోకపోవడంతో బుధవారం మధ్యాహ్నం నుంచి రఫీ తాగిన మైకంలో ఇంట్లో వారితో గొడవకు దిగాడు. అందరినీ కొడుతూ, తిడుతూ, చంపేస్తానని బెదిరించాడు. గురువారం తెల్లవారుజామున రఫీ మళ్లీ భార్యాపిల్లలతో గొడవ పడి కొట్టడం ప్రారంభించాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆశ.. గట్టిగా ప్రతిఘటించింది. దీనితో ఆగ్రహంతో రఫీ ఇంట్లో ఉన్న చార్జింగ్ వైరును తెచ్చి, ఆశ గొంతుకు వేసి గట్టిగా లాగడంతో ఆమె ఊపిరాడక అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. పిల్లల కేకలు వేయడంతో రఫీ అక్కడి నుండి పరారయ్యాడు.
హతురాలి కుమార్తె అన్నపురెడ్డి ఉమా వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేటపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్ సీఐ సుధాకర్ రావు ఈ కేసు దర్యాప్తును చేపట్టారు. దర్యాప్తులో భాగంగా బాపట్ల నుండి క్లూస్ టీమ్, మంగళగిరి నుండి ఫోరెన్సిక్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని నేర స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఆధారాలు సేకరించాయి. పరారీలో ఉన్న నిందితుడు రఫీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.



# జెడ్పీ హైస్కూల్ డైనింగ్ హాల్ నిర్మాణానికి విరాళం

**వేటపాలెం, జులై 09(నాదేశం) :** వేటపాలెం మండలం దేశాయిపేటలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థుల వసతుల కల్పనకై పట్టభద్రుల సంఘం ముందుకు వచ్చింది. పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణం కోసం పట్టభద్రుల సంఘం తరపున రూ.60,000 ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయ బృందానికి అందజేశారు. ఈ సందర్భంగా పట్టభద్రుల సంఘం అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ.. ప్రభుత్వ హైస్కూల్ లో చదువుకొనే విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో ఈ సాయం అందించినట్లు తెలిపారు. ప్రముఖ సంస్థ 'ఐటీసీ' వారు ఇక్కడ ఏర్పాటు చేస్తున్న డైనింగ్ హాల్ నిర్మాణానికి మ్యాచింగ్ గ్రాంట్ కింద తమ సంఘం ద్వారా ఈ అరవై వేల రూపాయల చెక్కును అందజేసినట్లు వివరించారు. ఈ డైనింగ్ హాల్ అందుబాటులోకి రావడం వల్ల విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసే సమయంలో శుభ్రత పాటించేందుకు, తద్వారా వారిలో ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగి విద్యాభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో పట్టభద్రుల సంఘం ఉపాధ్యక్షులు సాంబశివరావు, సహాయ కార్యదర్శి నాగాంజనేయులు, సభ్యులు మురళీకృష్ణ, రంగనాధ్, గుప్తా, పాఠశాల ఉపాధ్యాయులు మాల్యాద్రి, వెంకటేశ్వర్లు, గోపాలకృష్ణమూర్తి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అందుకే జగన్‌ను టార్గెట్ చేస్తున్నారు

- **ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించొద్దనే**
- **వైసీపీపీ నేత కన్నబాబు**




మాజీ సీఎం వైఎస్ జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక కూటమి ప్రభుత్వం వ్యక్తిగత విమర్శలకు దిగుతోందని మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఆరోపించారు. కాకినాడలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, ప్రజా సమస్యలకు సమాధానం చెప్పలేని పరిస్థితిలో డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వైఎస్ జగన్, ఆయన తల్లి విజయమ్మపై ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని, కుటుంబ సభ్యులపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం సంస్కారహీనతకు నిదర్శనమన్నారు. ప్రజలకు చేసిన మేలు చెప్పుకోలేక ప్రతిపక్షాన్ని లక్ష్యంగా చేసుకుని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, ప్రశ్నించే వారిపై కఠిన చట్టాలు ప్రయోగిస్తూ భయపెట్టే ప్రయత్నం జరుగుతోందని అన్నారు.

**అమరావతి, పోర్టులపై ఆరోపణలు**

అమరావతి నిర్మాణాల్లో చదరపు అడుగుకు రూ.20 వేల వరకు ఖర్చు చూపించడం అసాధారణ అవినీతికి నిదర్శనమని కన్నబాబు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన వ్యయంతో పోలిస్తే రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న ఖర్చు అనుమానాలకు తావిస్తోందన్నారు. వైఎస్ జగన్ హయాంలో దాదాపు పూర్తయిన రూ.5 వేల కోట్ల విలువైన రామాయపట్నం పోర్టును కేవలం రూ.1,500 కోట్లకే ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులు, పోర్టులు, మెడికల్ కాలేజీలను అడ్డగోలుగా ప్రైవేటు పరం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం అభివృద్ధి కాదని, ప్రజల ఆస్తులను అమ్మడమేనని పేర్కొన్నారు.

**ప్రజా సమస్యలపై వైసీపీ పోరాటం**

వైఎస్ జగన్ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, భూసంస్కరణలు దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందాయని కన్నబాబు గుర్తుచేశారు. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభమై నెలరోజులు గడిచినా యూనిఫామ్‌లు, పుస్తకాలు, బ్యాగులు అందలేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు బలహీనపడ్డాయని విమర్శించారు. యూట్యూబర్ రావణ్ వ్యవహారంలో కూడా తప్పుడు చట్టాలు ప్రయోగించి రాజకీయ ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అధికార బలంతో ప్రతిపక్షాన్ని అణచివేయాలని ప్రయత్నించినా వైఎస్సార్‌సీపీ ప్రజా సమస్యలపై పోరాటాన్ని ఆపబోదని స్పష్టం చేశారు.

ప్రభాత **కిరణమ్**
సత్యానికి వారధి

# 4
## GENERAL NEWS

శుక్రవారం 10 జులై 2026
www.prabhathakiranam.com

## ఆటో కార్మికుల విశ్రాంతి నిలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వేగుళ్ళ



ఆటో కార్మిక రంగంలో పని చేసే కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు గారు అన్నారు. స్థానిక బస్టాండ్ వద్ద నూతనంగా నిర్మించిన "ఆటో కార్మికుల విశ్రాంతి నిలయం" ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ ఎండనక, వాననక ప్రజలను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చే ఆటో కార్మికుల సేవలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. నిత్యం శ్రమించే ఆటో డ్రైవర్లు కాసేపు ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోవడానికి, ఎండ, వానల నుండి రక్షణ పొందేందుకు ఈ విశ్రాంతి నిలయం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ చిరకాల కోరికను గుర్తించి, విశ్రాంతి నిలయాన్ని అందుబాటులోకి తెచ్చినందుకు ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులు, డ్రైవర్లు ఎమ్మెల్యే వేగుళ్ళ కు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆటో కార్మికులు ఎమ్మెల్యేను దుశ్శాలువాతో, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, వివిధ ఆటో కార్మిక సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు మరియు పెద్ద సంఖ్యలో ఆటో కార్మికులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## 11న యాదాద్రి ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈనెల 11న నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో భవానీ శంకర్ తెలిపారు. ఉదయం 11.37 గంటలకు తిరుమల తరహాలో బంగారు వాకిలి వద్ద ప్రమాణ స్వీకారం జరుగుతుందని వెల్లడించారు. అనంతరం ప్రెసిడెంట్ సూట్‌లో ట్రస్ట్ బోర్డు తొలి సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. చైర్మన్‌గా ఎం. సత్యనారాయణ రెడ్డితో పాటు సభ్యులు, ఎక్స్‌అఫీషియో సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. కార్యక్రమానికి మీడియాకు అనుమతి లేదని, నిరాడంబరంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. వీఐపీలకు ఆహ్వానం లేదన్న అధికారుల వ్యాఖ్యలపై స్థానికులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

### రావణ్ బ్యాంకు ఖాతాలు సీజ్

యూట్యూబర్ జోసెఫ్ రావణ్‌పై దర్యాప్తు కొనసాగిస్తున్న కాకినాడ పోలీసులు అతని ఆర్థిక లావాదేవీలపై దృష్టి సారించారు. ఐసీఐసీఐ, యెస్ బ్యాంకులకు లేఖలు పంపగా, అతని పేరున్న బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. ప్రాథమిక విచారణలో వివాదాస్పద వీడియోలు ప్రచురిస్తూ నెలకు రూ.1.50 లక్షలకు పైగా ఆదాయం పొందుతున్నట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఇప్పటికే అతని మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ పరిశీలనకు పంపించారు. ఫోన్‌లోని వీడియోలు, తొలగించిన డేటా, వాట్సాప్ చాటింగ్‌లను విశ్లేషిస్తున్నారు. ఈ వ్యవహారంలో మరెవరైనా పాత్ర ఉందా అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

### రాధాగాయత్రి మృతి కేసులో కీలక మలుపు

విజయనగరం జిల్లాకు చెందిన టెకీ రాధాగాయత్రి అనుమానాస్పద మృతి కేసులో ఉత్తరాఖండ్ పోలీసులు కీలక చర్యలు చేపట్టారు. ఆమె భర్త శ్రీచరణ్‌తో పాటు అత్తమామలు దుర్గాప్రసాద్, సీతామహాలక్ష్మికి సమన్లు జారీ చేశారు. బీఎన్ఎస్ సెక్షన్ 103 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. శ్రీచరణ్ పనిచేస్తున్న పుణే కార్యాలయానికి నోటీసులు పంపించారు. మసూరీ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ రాహుల్ ఆనంద్ ఈ కేసుకు సంబంధించి సమాచారం ఉన్నవారు మౌఖికంగా లేదా రాతపూర్వకంగా వాంగ్మూలం ఇవ్వాలని కోరారు. ఈ నెల 17లోపు తమ వాంగ్మూలాలు సమర్పించాలని సూచించారు.




# టిట్ ఫర్ ట్యాట్..

- »మారుతున్న జెన్ జీ మైండ్ సెట్..
- »డిఫెన్స్‌లో మేనేజ్మెంట్
- »కార్పొరేట్ ప్రపంచానికి తలబొప్పి
- »సంస్థలకు పెరుగుతున్న సవాళ్లు

సంస్థ ఎలా ఉంటే.. ఉద్యోగులు కూడా అలానే మారతారు. ఒకప్పుడు అదనపు పని చేస్తేనే ఎదుగుదల వస్తుందని భావించిన ఉద్యోగ సంస్కృతి ఇప్పుడు వేగంగా మారుతోంది. పని పూర్తయితే చాలు.. మిగతా సమయం వ్యక్తిగత జీవితానికే కేటాయించాలనే ఆలోచన కొత్త తరంలో బలపడుతోంది. ఉద్యోగం కోసం జీవించడం కాదు.. జీవితం కోసం ఉద్యోగం చేయాలన్న భావన జెన్ జీ ఉద్యోగుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఫలితంగా సంస్థ కోసం అదనపు బాధ్యతలు తీసుకోవడం, కార్యాలయ సమయం దాటి పనిచేయడం, కొత్త పనులకు స్వచ్ఛందంగా ముందుకు రావడం వంటి ధోరణి క్రమంగా తగ్గుతోంది. ఆశ్చర్యకరంగా కార్యాలయ వాతావరణం మెరుగుపడుతున్నా, ఉద్యోగుల నిబద్ధత మాత్రం అదే స్థాయిలో పెరగడం లేదు. ఏఐ రాక, పని ఒత్తిడి, మారుతున్న జీవన విలువలు ఈ మార్పుకు ప్రధాన కారణాలుగా మారాయి. దీంతో ఉద్యోగుల ఆలోచనలను అర్థం చేసుకోవడం, వారికి అర్థవంతమైన పని వాతావరణాన్ని కల్పించడం సంస్థలకు కొత్త సవాల్‌గా మారింది. కంపెనీల నాయకత్వం ఎలా స్పందిస్తుందో.. రానున్న రోజుల్లో అదే ఉద్యోగుల పనితీరు, సంస్థల విజయాన్ని నిర్ణయించే కీలక అంశంగా నిలవనుంది.

# ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం

- ఫోటోల పిచ్చిని రాజముద్రతో తుడిచేశాం
- వైసీపీ తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ నల్లచట్టమే
- 2027 మార్చికి 72 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు
- పురాణాల్ని దూషించిన రావణ్‌కు వైసీపీ ఆర్థిక సాయం
- మీ భూమి- మీ హక్కు బహిరంగ సభలో సీఎం చంద్రబాబు

వివరాలు 5లో..





ప్రజల ఆస్తిపై పూర్తి అధికారం ప్రజలకే ఉండాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో నిర్వహించిన "మీ భూమి-మీ హక్కు" కార్యక్రమంలో రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. భూమి యజమానుల హక్కులను రక్షించే విధంగా రాజముద్రతో కూడిన కొత్త పాస్ పుస్తకాలను అందిస్తున్నామని తెలిపారు.

**ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై విమర్శలు**

గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టం ప్రజల్లో భయాందోళనలు సృష్టించిందని చంద్రబాబు ఆరోపించారు. ఆ చట్టం వల్ల భూములపై హక్కుల విషయంలో అనేక అనుమానాలు ఏర్పడ్డాయని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ చట్టాన్ని రద్దు చేశామని గుర్తు చేశారు. గత పాలకులు భూ పత్రాలు, సర్వే రాళ్లపై ఫోటోలు ముద్రించడం సరైంది కాదన్నారు. ఇప్పుడు రాజముద్రతో కూడిన భద్రతా ఫీచర్లు ఉన్న పాస్ పుస్తకాలను జారీ చేస్తూ ఆ విధానానికి ముగింపు పలికామని వెల్లడించారు.

# ఆర్టీసీ ప్రైవేటీకరించే ప్రసక్తే లేదు



- ఆధునీకరించేందుకే విద్యుత్ బస్సులు
- స్పష్టం చేసిన రవాణా కార్యదర్శి కృష్ణబాబు

ఏపీఎస్ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని రాష్ట్ర రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు స్పష్టం చేశారు. విద్యుత్ బస్సులతో ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థను నిర్మించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఆర్టీసీని ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్నారనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని తేల్చిచెప్పారు. సంస్థకు చెందిన భూములు, డిపోలు, భవనాలు, ఇతర ఆస్తులు యథాతథంగా ఏపీఎస్ఆర్టీసీ యాజమాన్యంలోనే కొనసాగుతాయని వివరించారు. ఉద్యోగులు, ప్రజలు అపోహలను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని కోరారు.

(వివరాలు 5లో..)

# లోకేశ్ దౌత్యం... ఏపీకి భారీగా పెట్టుబడులు

## దక్షిణ కొరియా పారిశ్రామికవేత్తలతో చర్చలు




రాష్ట్రంలో భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో వరుస సమావేశాలు నిర్వహించారు. సియోల్‌లో ప్రముఖ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో భేటీ అయి రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. సెమీకండక్టర్లు, డిస్‌ప్లే పరికరాల తయారీ రంగంలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన సునిక్ సిస్టమ్ కో. లిమిటెడ్ సీఈవో ఎస్.డబ్ల్యూ. చుంగ్‌తో సమావేశమైన లోకేశ్, శ్రీసిటీలో డిస్‌ప్లే పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరారు. సంస్థ ఏపీలో పెట్టుబడులకు ముందుకు వస్తే జాయింట్ వెంచర్ రూపంలో ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి ఉన్న అవకాశాలను కూడా వివరించారు.

# సంస్థాగత బలోపేతంపై ఫోకస్



- » జనసైనికులకు పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం
- » విజయవాడలో పార్టీ నేతలతో కీలక సమావేశం

విజయవాడలో జనసేన పార్టీ కీలక సమావేశం జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రజల్లో సంస్థను మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చ జరిగినట్లు సమాచారం. ఇటీవల రాజకీయంగా చర్చనీయాంశమైన 'రావణ్ ఎపిసోడ్'పై కూడా సమీక్ష జరిగినట్లు తెలుస్తోంది. ప్రతిపక్షాల విమర్శలకు సమర్థంగా స్పందించడంతో పాటు పార్టీ శ్రేణులు ప్రజల మధ్య మరింత చురుగ్గా పనిచేసేలా పవన్ దిశానిర్దేశం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

(వివరాలు 5లో..)

# కళాకారుడే అసలైన సంపద

- వారి ఆరోగ్య బాధ్యత ప్రభుత్వానిదే
- ఆరోగ్య రక్షణకు డిప్యూటీ సీఎం చర్యలు

# రాప్తాడు రగడ

## హీటెక్కిన పాలిటిక్స్ • అనంత రాజకీయం
## తోపుదుర్తిని వదలనన్న ఎమ్మెల్యే




అనంతపురం రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై హత్యాయత్నం ఘటన ఇప్పుడు అధికార టీడీపీ, ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ మధ్య తీవ్ర రాజకీయ పోరుకు కేంద్రబిందువైంది. ఒకవైపు 'చలో అనంతపురం' కార్యక్రమానికి బయలుదేరిన వైఎస్సార్‌సీపీ నేతలను పోలీసులు అడ్డుకోవడం, అరెస్టులు, హౌస్ అరెస్టులు చేయడంపై ఆ పార్టీ ప్రజాస్వామ్య హక్కుల హననమని మండిపడుతోంది.

## రాజకీయంగా వెంటాడుతా

తోపుదుర్తికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సవాల్




# డీల్ కోసం ఇరాన్ అడుక్కుంటోంది

వీడియో సందేశంతో ట్రంప్ వార్నింగ్




# నెట్ పరీక్ష కలకలం..

- » ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే
- » విద్యాశాఖ మంత్రిపై రాహుల్ దూకుడు
- » యూజీసీ-నెట్ వివాదంపై రాజకీయ వేడి



# రావణ్‌ను జోసఫ్‌గా మార్చిందెవరు?

## ప్రజలకు అన్నీ తెలుసన్న కొడాలి

రావణ్ వ్యవహారంలో వైసీపీపై వస్తున్న ఆరోపణలను మాజీ మంత్రి కొడాలి నాని తీవ్రంగా ఖండించారు. రావణ్‌ను జోసఫ్‌గా మార్చింది ఎవరో రాష్ట్ర ప్రజలకు తెలుసని, కమ్మ వ్యక్తిని దళితుడిగా, క్రిస్టియన్‌గా చిత్రీకరించింది టీడీపీ, ఎల్లో మీడియానేనని ఆరోపించారు. రావణ్‌కు వైఎస్సార్‌సీపీతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. జనసేన నాయకులు పెట్టిన కేసుల్లో రావణ్‌కు బెయిల్ ఇప్పించింది ఎవరో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ కానీ, వైసీపీ నాయకులు కానీ ఎవరూ బెయిల్ కోసం ప్రయత్నించలేదన్నారు. రావణ్ చంద్రబాబు, లోకేశ్, బాలకృష్ణలపై ఒక్క మాట కూడా మాట్లాడలేదని, పాత వీడియోలు చూస్తే అతను ఎవరికి అనుకూలంగా వ్యవహరించాడో అర్థమవుతుందని వ్యాఖ్యానించారు. చిన్న సోషల్ మీడియా పోస్టులకే అరెస్టులు చేసే ప్రభుత్వం గతంలో ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో వైఎస్సార్‌సీపీపై బురద చల్లే ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరిస్తూ, మతాల పేరుతో ప్రజలను విడగొట్టే రాజకీయాలు విజయవంతం కావని కొడాలి నాని అన్నారు.

# అందుకే జగన్‌ను టార్గెట్ చేస్తున్నారు

**ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించొద్దనే • వైసీపీ నేత కన్నబాబు విమర్శలు**




మాజీ సీఎం వైఎస్ జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక కూటమి ప్రభుత్వం వ్యక్తిగత విమర్శలకు దిగుతోందని మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఆరోపించారు. కాకినాడలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, ప్రజా సమస్యలకు సమాధానం చెప్పలేని పరిస్థితిలో డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వైఎస్ జగన్, ఆయన తల్లి విజయమ్మపై ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని, కుటుంబ సభ్యులపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం సంస్కారహీనతకు నిదర్శనమన్నారు. (3లో..)


# అమరావతిలో అవినీతి జోరు

- మావిగన్‌తోనే అభివృద్ధి సాధ్యం
- మాజీ మంత్రి సాకే శైలజానాథ్




అమరావతి నిర్మాణాల పేరుతో కూటమి ప్రభుత్వం వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ఆరోపించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మంత్రి నారాయణ వ్యాఖ్యలు వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నమని విమర్శించారు. గతంలో టెండర్లు పొందిన కంపెనీలకే ఇప్పుడు పనులు అప్పగించినా నిర్మాణ వ్యయాన్ని భారీగా పెంచడం వెనుక కారణమేంటో ప్రభుత్వం ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

(వివరాలు 3లో..)





# చైనా వరదల్లో పాముల దండు

వరదల్లో
900 విషసర్పాల కలకలం




# జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం గాలింపు

- కొండ ప్రాంతంలో జల్లెడ
- కుటుంబానికి కలెక్టర్ భరోసా




# నొప్పికి నిద్రే అసలైన మందు..

- నిర్లక్ష్యం చేస్తే ఆరోగ్యం కుప్పకూలే ప్రమాదం
- నిద్ర తగ్గితే నొప్పి పెరుగుతుంది
- మంచి నిద్రే ఉత్తమ చికిత్స
- నిద్ర అంటే విశ్రాంతి మాత్రమే కాదు

# లోకేశ్ దౌత్యం... ఏపీకి భారీగా పెట్టుబడులు



**దక్షిణ కొరియా పారిశ్రామికవేత్తలతో చర్చలు**

రాష్ట్రంలో భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో వరుస సమావేశాలు నిర్వహించారు. సియోల్‌లో ప్రముఖ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో భేటీ అయి రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. సెమీకండక్టర్లు, డిస్‌ప్లే పరికరాల తయారీ రంగంలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన సునిక్ సిస్టమ్ కో. లిమిటెడ్ సీఈవో ఎస్.డబ్ల్యూ. చుంగ్‌తో సమావేశమైన లోకేశ్, శ్రీసిటీలో డిస్‌ప్లే పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరారు. సంస్థ ఏపీలో పెట్టుబడులకు ముందుకు వస్తే జాయింట్ వెంచర్ రూపంలో ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి ఉన్న అవకాశాలను కూడా వివరించారు.

**కొరియా ప్రభుత్వంతో భాగస్వామ్యంపై చర్చలు**

దక్షిణ కొరియా రాజకీయ వ్యవహారాలు, విదేశాంగ శాఖ ఉపమంత్రి యుయ్‌హే సిసిలియా చుంగ్‌తో కూడా లోకేశ్ కీలక సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న 3ఎస్ విధానం అంటే వేగం, స్థిరత్వం, సేవలు పెట్టుబడిదారులకు విశ్వసనీయ వాతావరణాన్ని కల్పిస్తోందని వివరించారు. ఆంధ్రప్రదేశ్-కొరియా ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్ ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలో కొరియన్ కల్చరల్ సెంటర్ ప్రారంభించేందుకు సహకరించాలని కోరారు. నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ సంయుక్త శిక్షణ అకాడమీలు ఏర్పాటు చేసేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ చర్యలతో ఇరు ప్రాంతాల మధ్య పారిశ్రామిక, విద్యా, సాంస్కృతిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని అభిప్రాయపడ్డారు.

**కియా విస్తరణకు ఆహ్వానం**

కియా మోటార్స్ గ్లోబల్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ టే హన్ లీతో సమావేశమైన లోకేశ్, సంస్థ కార్యకలాపాలను ఆంధ్రప్రదేశ్‌లో మరింత విస్తరించాలని ఆహ్వానించారు. ప్రత్యేకంగా పీబీవీ వాహనాలు, ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాల తయారీ కేంద్రాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం పోర్టు సమీపంలో సీకేడీ అసెంబ్లింగ్, ఎగుమతి కేంద్రం ఏర్పాటు చేస్తే ప్రపంచ మార్కెట్లకు అనుసంధానం సులభమవుతుందని వివరించారు. ఆధునిక మౌలిక వసతులు, పారిశ్రామిక అనుకూల విధానాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన బలమని లోకేశ్ తెలిపారు. దక్షిణ కొరియా పర్యటన ద్వారా రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం

- ఫోటోల పిచ్చిని రాజముద్రతో తుడిచేశాం
- వైసీపీ తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ నల్లచట్టమే
- 2027 మార్చికి 72 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు
- పురాణాల్ని దూషించిన రావణ్‌కు వైసీపీ ఆర్థిక సాయం
- మీ భూమి- మీ హక్కు బహిరంగ సభలో సీఎం చంద్రబాబు



ప్రజల ఆస్తిపై పూర్తి అధికారం ప్రజలకే ఉండాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో నిర్వహించిన "మీ భూమి-మీ హక్కు" కార్యక్రమంలో రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. భూమి యజమానుల హక్కులను రక్షించే విధంగా రాజముద్రతో కూడిన కొత్త పాస్ పుస్తకాలను అందిస్తున్నామని తెలిపారు.

**ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై విమర్శలు**

గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టం ప్రజల్లో భయాందోళనలు సృష్టించిందని చంద్రబాబు ఆరోపించారు. ఆ చట్టం వల్ల భూములపై హక్కుల విషయంలో అనేక అనుమానాలు ఏర్పడ్డాయని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ చట్టాన్ని రద్దు చేశామని గుర్తు చేశారు. గత పాలకులు భూ పత్రాలు, సర్వే రాళ్లపై ఫోటోలు ముద్రించడం సరైంది కాదన్నారు. ఇప్పుడు రాజముద్రతో కూడిన భద్రతా ఫీచర్లు ఉన్న పాస్ పుస్తకాలను జారీ చేస్తూ ఆ విధానానికి ముగింపు పలికామని వెల్లడించారు.

**2027 నాటికి లక్షలాది పాస్ పుస్తకాలు**

2027 మార్చి నాటికి రాష్ట్రంలోని 9,833 గ్రామాల్లో 72.70 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తామని సీఎం ప్రకటించారు. భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే ప్రభుత్వ సంకల్పమన్నారు. 22ఏ జాబితాలో చేరిన అనేక భూముల సమస్యలను ఇప్పటికే పరిష్కరించామని చెప్పారు. విలేజ్ ఇనాం భూములకు రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేశామని వివరించారు. వారసత్వ ఆస్తుల బదిలీ ఆటో మ్యుటేషన్ ద్వారా వేగంగా జరుగుతోందని వెల్లడించారు. డోన్ నియోజకవర్గంలోని వక్ఫ్ భూములకు సంబంధించిన సమస్యలు కూడా పరిష్కరించామని తెలిపారు.

**రాయలసీమ అభివృద్ధిపై దృష్టి**

రాయలసీమ రూపురేఖలు పూర్తిగా మారేలా భారీ ప్రాజెక్టులు అమలు చేస్తున్నామని చంద్రబాబు చెప్పారు. కడప స్టీల్ ప్లాంట్, హీరో మోటార్స్ యూనిట్, డిఫెన్స్ ఫైటర్ జెట్ ప్లాంట్ వంటి పరిశ్రమలు ప్రాంతానికి కొత్త అవకాశాలు తీసుకొస్తాయని పేర్కొన్నారు. హార్టికల్చర్ రంగంలో భారీ పెట్టుబడులు వస్తున్నాయని వెల్లడించారు. నంద్యాల జిల్లాలో ఉద్యాన పంటలకు మంచి అవకాశాలు ఉన్నాయని అన్నారు. తక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో ప్రతి నీటి బొట్టును ఆదా చేయాలని ప్రజలకు సూచించారు. జలధార కార్యక్రమం ద్వారా భూగర్భ జలాలను పెంచే ప్రయత్నం జరుగుతోందని వివరించారు.

**సంక్షేమం, సుపరిపాలన లక్ష్యం**

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను సమానంగా అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటూ ప్రభుత్వ పనితీరును నిరంతరం మెరుగుపరుస్తున్నామని చెప్పారు. మంచి పనితీరు కనబరిచిన అధికారులను అభినందించారు. మహిళల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని హెచ్చరించారు. అత్యాధునిక వసతులతో రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

**వైసీపీపై రాజకీయ విమర్శలు**

వైసీపీ సమాజంలో కులం, మతం, ప్రాంతాల పేరుతో విభేదాలు సృష్టించే ప్రయత్నం చేస్తోందని చంద్రబాబు ఆరోపించారు. దేవాలయాలపై జరిగిన దాడుల విషయంలో గత ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీ ఘటనను కూడా ప్రస్తావించారు. ఇటీవల ఆదోనిలో జరిగిన ఆలయ అపచారం కేసులో నిందితుడిని వెంటనే అరెస్టు చేశామని చెప్పారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే చర్యలను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు.

**రావణ్ వ్యవహారంపై తీవ్ర వ్యాఖ్యలు**

పురాణాలను అవమానిస్తూ, శ్రీరాముడు, సీతాదేవిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రావణ్ అనే వ్యక్తికి వైసీపీ ఆర్థిక సహాయం అందించిందని చంద్రబాబు ఆరోపించారు. పాకిస్తాన్‌కు మద్దతు తెలిపే వారిని ప్రోత్సహించడం ప్రమాదకరమని అన్నారు. మత విశ్వాసాలను అవమానించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమాజంలో శాంతి, సామరస్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. సభ అనంతరం స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించిన సీఎం, వాటిని "స్వయం" బ్రాండ్ పేరుతో విస్తృతంగా మార్కెటింగ్ చేయాలని అధికారులకు సూచించారు.

# సంస్థాగత బలోపేతంపై ఫోకస్

- జనసైనికులకు పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం
- విజయవాడలో పార్టీ నేతలతో కీలక సమావేశం



విజయవాడలో జనసేన పార్టీ కీలక సమావేశం జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రజల్లో సంస్థను మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చ జరిగినట్లు సమాచారం. ఇటీవల రాజకీయంగా చర్చనీయాంశమైన 'రావణ్ ఎపిసోడ్'పై కూడా సమీక్ష జరిగినట్లు తెలుస్తోంది. ప్రతిపక్షాల విమర్శలకు సమర్థంగా స్పందించడంతో పాటు పార్టీ శ్రేణులు ప్రజల మధ్య మరింత చురుగ్గా పనిచేసేలా పవన్ దిశానిర్దేశం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

**'జనగళం' కార్యక్రమానికి ప్రాధాన్యం**

రాష్ట్రవ్యాప్తంగా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు చేపట్టనున్న 'జనగళం' కార్యక్రమంపై సమావేశంలో ప్రత్యేకంగా చర్చ జరిగింది. నాలుగు ప్రాంతాల్లో నిర్వహించే ఈ కార్యక్రమాల్లో తప్పనిసరిగా ఒక మంత్రి, నలుగురు ఎమ్మెల్యేలు పాల్గొనేలా మార్గదర్శకాలు జారీ చేసే అవకాశం ఉందని సమాచారం. నియోజకవర్గాల వారీగా పార్టీ కార్యక్రమాలపై పర్యవేక్షణ పెంచాలని, ప్రజా సమస్యలను వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే వ్యవస్థను బలోపేతం చేయాలని పవన్ సూచించినట్లు తెలుస్తోంది. ఓటర్ల జాబితా పరిశీలన, సంస్థాగత విస్తరణ, ప్రజా సమస్యల పరిష్కారంపై నాయకులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేసినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

# కళాకారుడే అసలైన సంపద

- వారి ఆరోగ్య బాధ్యత ప్రభుత్వానిదే
- ఆరోగ్య రక్షణకు డిప్యూటీ సీఎం చర్యలు

సంప్రదాయ కళలను కాపాడాలంటే వాటిని ప్రోత్సహించడం మాత్రమే కాకుండా, వాటిని జీవనాధారంగా చేసుకున్న కళాకారుల ఆరోగ్యం, సంక్షేమాన్ని కూడా పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవం సందర్భంగా హస్తకళాకారులు, చేనేత కార్మికులతో మాట్లాడిన సమయంలో వారు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు తన దృష్టికి వచ్చాయని వెల్లడించారు. ఏళ్ల తరబడి ఒకే పనిలో నిమగ్నమై ఉండటంతో వెన్నునొప్పి, మెడ నొప్పి, కీళ్ల నొప్పులు, కంటి సమస్యలు, శ్వాసకోశ ఇబ్బందులు వంటి అనేక ఆరోగ్య సమస్యలు వారిని వేధిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను తమ చేతివృత్తితో నిలబెడుతున్న కళాకారుల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ కర్తవ్యమని ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు.

**రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక వైద్య శిబిరాలు**

కళాకారుల సమస్యలను తెలుసుకున్న వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి రాష్ట్రంలోని హస్తకళా, చేనేత క్లస్టర్లలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పవన్ కళ్యాణ్ వెల్లడించారు. ఇప్పటికే శ్రీకాళహస్తి కలంకారీ కళాకారులు, సీతారాంపురం క్రోషేలేస్ కళాకారుల కోసం వైద్య శిబిరాలు నిర్వహించామని తెలిపారు. గురువారం కొండపల్లి బొమ్మల కళాకారులు, ఉప్పాడ చేనేత కార్మికులు, మాధవరం, యాడికి చేనేత కార్మికుల కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జులై 10న బొబ్బిలి వీణ కళాకారులు, ఎటికొప్పాక కళాకారులు, హ్యాండ్ నాటెడ్ వూలెన్ పైల్ కార్పెట్ కళాకారులు, మదనపల్లె చేనేత కార్మికులకు వైద్య సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. జులై 11న ధర్మవరం చేనేత కార్మికులు, బుడితి ఇత్తడి కళాకారులు, పెడన బ్లాక్ కలంకారీ కళాకారులు, చెక్క శిల్ప కళాకారుల కోసం కూడా వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

**కళను కాపాడాలంటే కళాకారుడిని కాపాడాలి**

ఈ వైద్య శిబిరాల ద్వారా సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు అవసరమైన చోట నిపుణుల వైద్య సేవలు, ప్రత్యేక పరీక్షలు, తదుపరి చికిత్సకు అవసరమైన మార్గదర్శకత్వం కూడా అందిస్తామని పవన్ కళ్యాణ్ చెప్పారు. రాష్ట్రంలోని మరిన్ని హస్తకళా, చేనేత క్లస్టర్లలో కూడా ఇదే తరహా కార్యక్రమాలను దశలవారీగా విస్తరిస్తామని తెలిపారు. ప్రతి హస్తకళాకారుడు, ప్రతి చేనేత కార్మికుడు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కళను గౌరవించడం అంటే కళాకారుడి శ్రమను గౌరవించడమేనని, కళాకారుడి శ్రమను గౌరవించడం అంటే అతని ఆరోగ్యాన్ని కాపాడటమేనని పేర్కొన్నారు. కళాకారులు ఆరోగ్యంగా ఉంటేనే సంప్రదాయ కళలు, సాంస్కృతిక వారసత్వం భావితరాలకు సజీవంగా అందుతాయని, అందుకే "కళను కాపాడాలంటే ముందు కళాకారుడిని కాపాడాలి" అనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

# ఆర్టీసీ ప్రైవేటీకరించే ప్రసక్తే లేదు

- ఆధునీకరించేందుకే విద్యుత్ బస్సులు
- స్పష్టం చేసిన రవాణా కార్యదర్శి కృష్ణబాబు



ఏపీఎస్‌ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని రాష్ట్ర రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు స్పష్టం చేశారు. విద్యుత్ బస్సులతో ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థను నిర్మించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఆర్టీసీని ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్నారనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని తేల్చిచెప్పారు. సంస్థకు చెందిన భూములు, డిపోలు, భవనాలు, ఇతర ఆస్తులు యథాతథంగా ఏపీఎస్‌ఆర్టీసీ యాజమాన్యంలోనే కొనసాగుతాయని వివరించారు. ఉద్యోగులు, ప్రజలు అపోహలను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని కోరారు.

**విద్యుత్ బస్సులే ప్రధాన లక్ష్యం**

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా రవాణాను మరింత ఆధునికంగా తీర్చిదిద్దే దిశగా విద్యుత్ బస్సులను ప్రవేశపెడుతోందని కృష్ణబాబు తెలిపారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రయాణికులకు సౌకర్యవంతమైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. విద్యుత్ బస్సుల నిర్వహణ కోసం ప్రైవేటు సంస్థలకు అవసరమైన మేరకు మాత్రమే డిపో ప్రాంగణాల వినియోగానికి అనుమతి ఇస్తామని స్పష్టం చేశారు. లీజు ఇవ్వడం, యాజమాన్యం బదిలీ చేయడం, ఆస్తులను అప్పగించడం వంటి చర్యలు ఉండవని వెల్లడించారు.

**ప్రస్తుతం కూడా హైర్ విధానమే**

ప్రస్తుతం ఏపీఎస్‌ఆర్టీసీలో సుమారు 26 శాతం డీజిల్ బస్సులు హైర్ విధానంలోనే నడుస్తున్నాయని అధికారులు తెలిపారు. మిగిలిన 74 శాతం బస్సులు సంస్థ సొంతమని చెప్పారు. ఇదే విధానాన్ని విద్యుత్ బస్సుల విషయంలో కూడా అనుసరిస్తామని వివరించారు. బస్సులు నడిచిన కిలోమీటర్ల ఆధారంగా మాత్రమే చెల్లింపులు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ విధానం దేశవ్యాప్తంగా అమల్లో ఉన్న ప్రమాణాలకు అనుగుణంగా ఉంటుందని తెలిపారు.

**కేంద్ర పథకంలో భాగంగా అమలు**

విద్యుత్ బస్సుల ప్రవేశపెట్టడం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక నిర్ణయం కాదని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ పథకంలో భాగమని కృష్ణబాబు వెల్లడించారు. దేశంలోని 22 రాష్ట్రాలు, ఆరు కేంద్ర పాలిత ప్రాంతాలకు ఒకే విధానంలో విద్యుత్ బస్సులు కేటాయిస్తున్నారని చెప్పారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన టెండర్లలో ఎంపికైన సంస్థల ద్వారా బస్సులు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ప్రతి కిలోమీటరుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుండగా, మిగిలిన వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు.

**త్వరలో 750 విద్యుత్ బస్సులు రాక**

మొదటి విడతలో రాష్ట్రానికి 750 విద్యుత్ బస్సులు రానున్నాయని అధికారులు వెల్లడించారు. ఈ బస్సులు 11 పట్టణాల్లో దశలవారీగా సేవలు ప్రారంభిస్తాయని చెప్పారు. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, సింహపురి ప్రాంతాల్లో కొత్త డిపోలు, ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతిలో స్థలాభావం కారణంగా కొన్ని షెడ్యూళ్లను సమీప డిపోలకు మార్చాల్సి వస్తోందని వివరించారు. ఈ సమస్యలకు కూడా త్వరలో పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

**ఉద్యోగులకు పూర్తి భద్రత**

విద్యుత్ బస్సులు వచ్చిన తర్వాత ఒక్క ఉద్యోగికీ నష్టం జరగదని కృష్ణబాబు స్పష్టం చేశారు. ఉద్యోగులను తొలగించడం, అదనపు సిబ్బందిగా ప్రకటించడం, ఉద్యోగ భద్రతకు భంగం కలిగించడం వంటి చర్యలు ఉండవని తెలిపారు. ఉద్యోగ సంఘాలతో ఇప్పటికే చర్చలు ప్రారంభమయ్యాయని చెప్పారు. వారి సూచనలను పరిగణనలోకి తీసుకుని అందరికీ ఆమోదయోగ్యమైన విధానాన్ని రూపొందిస్తామని వెల్లడించారు. డ్రైవర్లు, మెకానికల్ సిబ్బంది పాత్రను కొనసాగించే ప్రత్యామ్నాయ నమూనాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు.

**అన్ని సేవల్లో విద్యుత్ బస్సులే**

2029 నాటికి డీజిల్ బస్సులను దశలవారీగా విద్యుత్ బస్సులతో భర్తీ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కృష్ణబాబు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో నడిచే పల్లెవెలుగు సేవలు సహా అన్ని విభాగాల్లో ఎయిర్ కండీషన్డ్ విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. తొలి విడత బస్సులు ఆగస్టు లేదా సెప్టెంబర్‌లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. తిరుమల కోసం అదనంగా 300 విద్యుత్ బస్సుల టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న శ్రీశక్తి, దివ్యాంగశక్తి వంటి సంక్షేమ పథకాలు యథాతథంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రయాణికులకు అందుతున్న రాయితీలు, సేవల్లో ఎలాంటి మార్పు ఉండదని పేర్కొన్నారు.

# రాజకీయంగా వెంటాడుతా

## తోపుదుర్తికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సవాల్



మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. తన ప్రాణం ఉన్నంత వరకు తోపుదుర్తిని రాజకీయంగా వెంటాడుతానని స్పష్టం చేశారు. వ్యక్తిగతంగా కాకుండా రాజకీయంగా ప్రజల ముందే ప్రశ్నిస్తానని పేర్కొన్నారు. తాను లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా దాడులకు పాల్పడటం సరైన రాజకీయ సంస్కృతి కాదని విమర్శించారు. తనకు సమాధానం చెప్పే ధైర్యం లేకపోవడంతోనే బీరుబాటిళ్లు, రాళ్లతో దాడులు చేయించే ప్రయత్నం జరిగిందని ఎంఎస్ రాజు ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది పోయి హింసాత్మక చర్యలను ఆశ్రయించడం బాధాకరమన్నారు. రాజకీయ విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించాలే తప్ప దాడులతో కాదని వ్యాఖ్యానించారు. ఈ తరహా చర్యలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు.

**ఆరోపణలు నిరూపించాలని సవాల్**

తోపుదుర్తిని నమ్మి డబ్బులు ఇచ్చి మోసపోయిన అనేక మంది ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్నారని ఎంఎస్ రాజు ఆరోపించారు. అలాంటి వారిలో ఒక్కరినైనా పరామర్శించారా అని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు, వారి సమస్యలపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత నాయకులపై ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం రాజకీయ నాయకుడి ప్రధాన బాధ్యత అని అన్నారు. తోపుదుర్తి తనపై చేసిన ఆరోపణలను నిరూపించాలని ఇప్పటికే గడువు ఇచ్చానని ఎంఎస్ రాజు గుర్తుచేశారు. తాను ఎప్పుడూ వ్యక్తిగత ఘర్షణకు పిలుపు ఇవ్వలేదని స్పష్టం చేశారు. తన ఇంటికి వచ్చి ముష్టియుద్ధం చేయాలని ఎక్కడా చెప్పలేదని అన్నారు. తాను కోరింది నిజానిజాలపై స్పష్టత మాత్రమేనని వివరించారు.

**కుల వివాదాలపై స్పందన**

రెడ్డి సామాజిక వర్గాన్ని తాను ఎక్కడా అవమానించలేదని ఎంఎస్ రాజు స్పష్టం చేశారు. తన పోరాటం ఒక్క తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో మాత్రమేనని చెప్పారు. అయితే తనను, తన సామాజిక వర్గాన్ని కుల దురహంకారంతో కించపరిచారని ఆరోపించారు. అలాంటి వ్యాఖ్యలను ఎందుకు భరించాలని ప్రశ్నించారు. రాజకీయ విమర్శలు వ్యక్తిగత అవమానాలకు దారి తీయకూడదని అభిప్రాయపడ్డారు. సత్యసాయి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా అసత్య ఆరోపణలను ఖండించడం తన బాధ్యత అని ఎంఎస్ రాజు పేర్కొన్నారు. పార్టీ నాయకులపై, తమపై వస్తున్న ఆరోపణలను ప్రజల ముందు తిప్పికొట్టడం తప్పనిసరి అని అన్నారు. నిజాలను ప్రజలకు తెలియజేయడమే తన లక్ష్యమని చెప్పారు. రాజకీయాల్లో విమర్శలు సహజమే అయినా అవి ఆధారాలతో ఉండాలని సూచించారు.

# రాప్తాడు రగడ

- హీటెక్కిన పాలిటిక్స్
- అనంత రాజకీయం
- తోపుదుర్తిని వదలనన్న ఎమ్మెల్యే

అనంతపురం రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై హత్యాయత్నం ఘటన ఇప్పుడు అధికార టీడీపీ, ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ మధ్య తీవ్ర రాజకీయ పోరుకు కేంద్రబిందువైంది. ఒకవైపు 'చలో అనంతపురం' కార్యక్రమానికి బయలుదేరిన వైఎస్సార్‌సీపీ నేతలను పోలీసులు అడ్డుకోవడం, అరెస్టులు, హౌస్ అరెస్టులు చేయడంపై ఆ పార్టీ ప్రజాస్వామ్య హక్కుల హననమని మండిపడుతోంది. మరోవైపు ఈ ఘటనను రాజకీయంగా వాడుకుంటున్నారని అధికార పక్షం ఎదురుదాడికి దిగింది. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తోపుదుర్తిపై ఘాటు విమర్శలు చేస్తూ రాజకీయంగా వెంటాడుతానని ప్రకటించగా, వైఎస్సార్‌సీపీ మాత్రం హత్యాయత్నం కేసును కప్పిపుచ్చేందుకే ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని ఆరోపిస్తోంది. ఇరు పార్టీల నేతలు పరస్పరం సవాళ్లు, ప్రతి సవాళ్లతో విమర్శల దాడి కొనసాగిస్తున్నారు. దీంతో రాప్తాడు రాజకీయాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. హత్యాయత్నం కేసు చుట్టూ మొదలైన ఈ వివాదం ఇప్పుడు చలో అనంతపురం ఉద్యమం, పోలీసుల చర్యలు, కుల రాజకీయాలు, ప్రజాస్వామ్య హక్కుల అంశాలతో మరింత ముదిరి వైసీపీ వర్సెస్ టీడీపీగా మారింది.


# 'చలో అనంతపురం'పై ఆంక్షలా?

**అడుగడుగునా పోలీసుల అడ్డంకులన్న వైసీపీ**

టీడీపీ ఎమ్మెల్యేలకు సమాధానం ఇచ్చేందుకు వెళ్తున్న రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని అనంతపురం శ్రీనగర్ కాలనీలో పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఆందోళన చేపట్టి పోలీసుల తీరును ఖండించారు. ప్రతిపక్ష నాయకులను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆరోపించారు. అదే సమయంలో తోపుదుర్తికి సంఘీభావం తెలిపేందుకు వైఎస్సార్‌సీపీ చేపట్టిన 'చలో అనంతపురం' కార్యక్రమం జిల్లాలో ఉద్రిక్తతకు దారితీసింది. పార్టీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు పలు ప్రాంతాల్లో అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రాప్తాడుకు వెళ్తున్న మాజీ మంత్రి ఉషాశ్రీచరణ్‌ను పెనుకొండ వద్ద పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులతో వాగ్వాదం జరిగిన తర్వాత ఆమె రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ప్రతిపక్ష నాయకులను పరామర్శించే హక్కును కూడా హరిస్తున్నారని ఆమె ఆరోపించారు.

**ఎంఎస్ రాజుకు సూటి ప్రశ్నలు**

తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం ఘటనను కప్పిపుచ్చేందుకే కూటమి ప్రభుత్వం కొత్త రాజకీయ నాటకానికి తెరలేపిందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు ఆరోపించారు. ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. అనంతపురం రాజకీయ పరిణామాలు కూడా అదే వ్యూహంలో భాగమని పేర్కొన్నారు. టీడీపీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పదేపదే కుల అంశాలను



ప్రస్తావించడం సమాజానికి మంచిది కాదని వైసీపీ నేత కొమ్మూరి కనకారావు అన్నారు. నిజంగా దళితుల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే విజయవాడలో మాదిగ యువకుడు క్రాంతికుమార్ మరణంపై ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఆ కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదని నిలదీశారు.



- నిర్లక్ష్యం చేస్తే ఆరోగ్యం కుప్పకూలే ప్రమాదం
- నిద్ర తగ్గితే నొప్పి పెరుగుతుంది
- మంచి నిద్రే ఉత్తమ చికిత్స
- నిద్ర అంటే విశ్రాంతి మాత్రమే కాదు

# సర్వరోగ నివారిణి

## నొప్పికి నిద్రే అసలైన మందు..

- డాక్టర్ గుత్తి నాగేశ్వరరావు,
ఎంబీబీఎస్, ఎం.డి.,
గుంటూరు మెడికల్ కాలేజీ

నిద్ర అనేది శరీరానికి విశ్రాంతి మాత్రమే కాదు, అవయవాలను పునరుద్ధరించే సహజ వైద్య ప్రక్రియ. నేటి జీవనశైలిలో నిద్రను నిర్లక్ష్యం చేయడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. నిద్రలేమి వల్ల నొప్పిని తట్టుకునే శక్తి తగ్గి వెన్ను, మెడ, కీళ్ల నొప్పులు, తలనొప్పి మరింత పెరుగుతాయి. నొప్పి పెరిగితే నిద్ర తగ్గుతుంది, నిద్ర తగ్గితే నొప్పి పెరుగుతుంది. ఈ దుష్టచక్రాన్ని ఆపాలి. రోజుకు 7-8 గంటల నాణ్యమైన నిద్ర, సమయానికి పడుకోవడం, మొబైల్ వినియోగం తగ్గించడం, వ్యాయామం, యోగా అవసరం. దీర్ఘకాలిక నొప్పులతో బాధపడేవారు నిద్ర సమస్యలను కూడా వైద్యుల పర్యవేక్షణలో చికిత్స చేయించుకోవాలి. నిద్ర సమయంలో మెదడు మలినాలను తొలగిస్తుంది. నిద్రలేమి వల్ల ఇవి పేరుకుపోయి జ్ఞాపకశక్తి తగ్గడం, డిమెన్షియా ప్రమాదం పెరుగుతుంది. మంచి నిద్ర ఆరోగ్యానికి సహజ ఔషధం.



**రాత్రి పన్నెండు దాటినా నగరం నిద్రపోవడం లేదు... ఒక్కచోట ఐటీ ఉద్యోగి కంప్యూటర్ స్క్రీన్‌నే చూస్తున్నాడు. ఇంకోచోట విద్యార్థి మొబైల్ వెలుతురులో రేపటి ప్రపంచాన్ని వెతుకుతున్నాడు. మరో ఇంట్లో ఈఎంఐలు, అప్పులు, ఉద్యోగ భయం కళ్లకు నిద్ర రానివ్వడం లేదు. ఎవరో నొప్పితో మంచంపై అటూ ఇటూ తిరుగుతున్నారు. ఇంకెవరో నిద్ర మాత్ర చేతిలో పట్టుకుని గడియారం వైపు చూస్తున్నారు. తెల్లవారేసరికి నగరాలు మేల్కొంటాయి. కానీ లక్షలాది మంది మనుషులు మాత్రం అలసిపోయిన శరీరాలతో కొత్త రోజును ప్రారంభిస్తున్నారు. కాఫీ కప్పులు పెరుగుతున్నాయి. పెయిన్‌కిల్లర్లు పెరుగుతున్నాయి. ఆసుపత్రుల క్యూలు పెరుగుతున్నాయి. తగ్గిపోతున్నది ఒక్కటే... ప్రశాంతమైన నిద్ర. ఆధునిక జీవనశైలిలో మనిషి డబ్బు కోసం పరుగులు పెడుతున్నాడు. ఆ పరుగులో తన ఆరోగ్యాన్నే వెనక్కి వదిలేస్తున్నాడు. శరీరం ఇచ్చే ప్రతి నొప్పి వెనుక కనిపించని నిందితుడు ఒకడే. అదే నిద్రలేమి. అందుకే ఇప్పుడు వైద్యులు చెబుతున్న హెచ్చరిక ఒక్కటే... నొప్పిని కాదు... ముందుగా నిద్రను కాపాడుకోండి.**

### నిద్రలేమి మెదడుపై ప్రభావం.. శరీరంలో మార్పులు

తాజా పరిశోధనలు ఒక కీలక విషయాన్ని వెల్లడించాయి. నిద్రలేమి వల్ల మెదడులో నొప్పిని నియంత్రించే వ్యవస్థ బలహీనపడుతుంది. నొప్పిని తగ్గించే సహజ రసాయనాల ఉత్పత్తి తగ్గిపోతుంది. దీంతో చిన్న నొప్పి కూడా ఎక్కువగా అనిపిస్తుంది. శరీరంలోని నొప్పి పరిమితి తగ్గిపోతుంది. మెదడులోని కొన్ని భాగాల పనితీరు మారిపోవడం వల్ల భావోద్వేగ నియంత్రణ కూడా దెబ్బతింటుంది. ఫలితంగా నొప్పిని మానసికంగా భరించే శక్తి తగ్గుతుంది. ఒకే ఒక్క రాత్రి నిద్రలేమి కూడా అసౌకర్యాన్ని గణనీయంగా పెంచగలదని అధ్యయనాలు సూచిస్తున్నాయి. సరైన నిద్ర లేకపోతే శరీరంలోని సహజ నొప్పి నిరోధక వ్యవస్థ మందగిస్తుంది. నొప్పి తీవ్రతను తగ్గించే ఎండోర్ఫిన్ల ఉత్పత్తి తగ్గుతుంది. ఒత్తిడి హార్మోన్లు అధికంగా విడుదల అవుతాయి. శరీరంలో వాపు ప్రక్రియ పెరుగుతుంది. గాయాలు మానడానికి ఎక్కువ సమయం పడుతుంది. కణజాల మరమ్మతు నెమ్మదిస్తుంది. దీర్ఘకాలిక స్వల్ప వాపు శరీరంలో కొనసాగుతూ ఇప్పటికే ఉన్న నొప్పులను మరింత పెంచుతుంది. మానసిక అసహనం పెరగడం వల్ల చిన్న అసౌకర్యం కూడా భరించలేనంతగా అనిపించే పరిస్థితి ఏర్పడుతుంది.



**చా**లామంది నిద్రను శరీరానికి విశ్రాంతి ఇచ్చే సమయంగా మాత్రమే భావిస్తారు. కానీ వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం నిద్ర అనేది శరీరం రిపేర్ కోసం అత్యంత కీలకమైన జీవ ప్రక్రియ. మనం నిద్రలో ఉన్న సమయంలో దెబ్బతిన్న కణాలు మరమ్మతు అవుతాయి. శరీరంలోని హార్మోన్లు సమతుల్య స్థితికి వస్తాయి. రోగనిరోధక శక్తి బలపడుతుంది. మెదడు రోజంతా సేకరించిన సమాచారాన్ని క్రమబద్ధీకరిస్తుంది. జ్ఞాపకశక్తిని నిల్వ చేస్తుంది. హానికర వ్యర్థాలను తొలగించే పనిని కూడా నిద్రలోనే మెదడు నిర్వహిస్తుంది. అందుకే మంచి ఆరోగ్యానికి ఆహారం ఎంత అవసరమో నిద్ర కూడా అంతే అవసరమని వైద్యులు చెబుతున్నారు.

### దేశంలో పెరుగుతున్న నిద్ర సంక్షోభం

మన శరీరంలో సహజసిద్ధంగా పనిచేసే 24 గంటల ఒక లైఫ్ సర్కిల్ పనిచేస్తుంటుంది. గడియారం తిరిగినట్టుగా తిరుగూనే ఉంటుంది. దీనినే సర్కేడియన్ రిథమ్ అని పిలుస్తారు. పగలు-రాత్రి మార్పులకు అనుగుణంగా శరీరం పనిచేసే విధానాన్ని ఇది నియంత్రిస్తుంది. ఎప్పుడు నిద్ర రావాలి... ఎప్పుడు ఆకలి వేయాలి... శరీర ఉష్ణోగ్రత ఎలా ఉండాలి... జీవక్రియలు ఎలా సాగాలి... రోగనిరోధక వ్యవస్థ ఎలా స్పందించాలనే అంశాలన్నింటిపై దీని ప్రభావం ఉంటుంది. ముఖ్యంగా నొప్పిని శరీరం ఎలా గుర్తిస్తుంది... ఎంత తీవ్రంగా అనుభవిస్తుందన్న విషయాన్ని కూడా ఈ లైఫ్ క్లాక్ ప్రభావితం చేస్తుంది. కాబట్టి నిద్రపోయిన గంటల సంఖ్య మాత్రమే కాదు... సరైన సమయంలో నిద్రపోవడం కూడా అంతే ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. భారత్‌లో నిద్ర సమస్యలు వేగంగా పెరుగుతున్నాయి. వివిధ అధ్యయనాల ప్రకారం దాదాపు 59 శాతం మంది భారతీయులు రోజుకు ఆరు గంటల కంటే తక్కువ నిరంతర నిద్ర పోతున్నారు. దీంతో ప్రపంచంలో అత్యల్ప నిద్రపోయే దేశాల జాబితాలో భారత్ చేరింది. ఉద్యోగ ఒత్తిడి, రాత్రి షిఫ్ట్‌లు, మారిన జీవనశైలి, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, టీవీల నుంచి వచ్చే బ్లూ లైట్ ప్రభావం, రాత్రివేళల శబ్ద కాలుష్యం, సరైన సమయానికి భోజనం చేయకపోవడం వంటి అనేక కారణాలు ఈ పరిస్థితికి దారితీస్తున్నాయి. నిద్రలేమి ఇప్పుడు వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు... ప్రజారోగ్యానికి పెద్ద సవాలుగా మారుతోంది.

### నిద్ర–నొప్పి మధ్య విడదీయలేని సంబంధం

ప్రతిరోజూ సరిపడా నిద్రపోని వారు తెలియకుండానే దీర్ఘకాలిక నిద్ర అప్పులోకి వెళ్లిపోతారు. ఈ పరిస్థితి వెన్నునొప్పి, మెడ నొప్పి, తలనొప్పి, కీళ్ల నొప్పులు, గాయాల తర్వాత మిగిలే నొప్పులను మరింత తీవ్రతరం చేస్తుంది. సాధారణంగా తట్టుకోగలిగే నొప్పి కూడా ఎక్కువగా అనిపిస్తుంది. ఫలితంగా ఉద్యోగ సామర్థ్యం తగ్గుతుంది. రోడ్డు ప్రమాదాల ప్రమాదం పెరుగుతుంది. మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. కుటుంబ జీవితం కూడా ప్రభావితమవుతుంది. క్రమంగా శారీరక సామర్థ్యం తగ్గిపోవడం ప్రారంభమవుతుంది. నిద్ర, నొప్పి రెండూ ఒకదానిపై మరొకటి నేరుగా ప్రభావం చూపుతాయి. దీర్ఘకాలిక నొప్పితో బాధపడే వ్యక్తులకు రాత్రి నిద్ర మధ్యలో పలుమార్లు మెలకువ వస్తుంది. గాఢ నిద్ర ఉండదు. ఉదయం లేచిన తర్వాత కూడా అలసట అలాగే ఉంటుంది. మరోవైపు ఒక రోజు నిద్ర సరిగా లేకపోతే మరుసటి రోజు నొప్పి మరింత ఎక్కువగా అనిపిస్తుంది. ఇలా నొప్పి నిద్రను దెబ్బతీస్తుంది. నిద్రలేమి మళ్లీ నొప్పిని పెంచుతుంది. ఈ చక్రం నుంచి బయటపడకపోతే సమస్య మరింత క్లిష్టంగా మారుతుంది.

### • నొప్పి మందులు.. నిద్రకు ప్రత్యేక ప్రాధాన్యం

చాలామంది నొప్పి వచ్చినప్పుడు వెంటనే మందులపై ఆధారపడతారు. కానీ వైద్యుల అభిప్రాయం ప్రకారం నిద్రకు ప్రాధాన్యం ఇవ్వకుండా కేవలం మందులతోనే సమస్యను పూర్తిగా నియంత్రించడం సాధ్యం కాదు. మంచి నిద్ర వల్ల చాలా మందిలో నొప్పి తీవ్రత గణనీయంగా తగ్గుతుంది. కొన్ని సందర్భాల్లో ఇది నొప్పి మందుల కంటే మెరుగైన ఫలితాలను ఇవ్వగలదని పరిశోధనలు చెబుతున్నాయి. నిద్రలేమితో బాధపడేవారిలో నొప్పి మందుల ప్రభావం కూడా తగ్గే అవకాశం ఉంటుంది. అదే స్థాయి ఉపశమనం పొందాలంటే ఎక్కువ మోతాదు అవసరమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. ఆర్థరైటిస్, మెడ నొప్పి, వెన్నునొప్పి, మైగ్రేన్ సహా తలనొప్పులు, మధుమేహం వల్ల వచ్చే నరాల నొప్పులు, ఫైబ్రోమైయాల్జియా, మయోఫేషియల్ పెయిన్ సిండ్రోమ్, కాంప్లెక్స్ రీజినల్ పెయిన్ సిండ్రోమ్, క్యాన్సర్‌కు సంబంధించిన నొప్పులు వంటి అనేక దీర్ఘకాలిక వ్యాధుల్లో నిద్ర కీలక పాత్ర పోషిస్తుంది. ఈ రోగులకు చికిత్స అందించేటప్పుడు నిద్ర నాణ్యతను కూడా తప్పనిసరిగా పరిశీలించాలని నిపుణులు సూచిస్తున్నారు. సమస్య మూలాన్ని గుర్తించడం, మానసిక స్థితిని అంచనా వేయడం, జీవనశైలిని మార్చడం, అవసరమైతే నిద్ర నిపుణుల సలహా తీసుకోవడం వంటి సమగ్ర విధానం అనుసరిస్తే మెరుగైన ఫలితాలు కనిపిస్తాయి.

### • మంచి నిద్ర కోసం పాటించాల్సిన అలవాట్లు

ఆరోగ్యకరమైన నిద్ర ఉదయం నుంచే ప్రారంభమవుతుంది. ప్రతిరోజూ కొంతసేపు సూర్యకాంతిలో గడపడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, సమయానికి భోజనం చేయడం, సమతుల్య ఆహారం తీసుకోవడం మంచిది. రాత్రి పడుకునే ముందు మొబైల్ ఫోన్, టీవీ, ల్యాప్‌టాప్ వినియోగాన్ని తగ్గించాలి. కాఫీ, టీ, మద్యం వంటి ఉత్తేజక పదార్థాలను రాత్రివేళలకు దూరంగా ఉంచాలి. ప్రతిరోజూ ఒకే సమయంలో నిద్రపోయే అలవాటు పెంచుకోవాలి. పడకగదిని ప్రశాంతంగా, చల్లగా ఉంచాలి. కార్యాలయ ఒత్తిడిని, కుటుంబ సమస్యలను పడకగదిలోకి తీసుకురాకూడదు. యోగా, ధ్యానం, శ్వాస వ్యాయామాలు నిద్ర నాణ్యతను మెరుగుపరచడంలో ఉపయోగపడతాయి. తీవ్రమైన నిద్ర సమస్యలు ఉంటే వైద్యుల పర్యవేక్షణలో ప్రత్యేక చికిత్స తీసుకోవడం మంచిది. నిద్ర అనేది ఖర్చు లేని సహజ ఔషధం అని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక నొప్పులతో బాధపడే వారికి ఇది మొదటి చికిత్సగా ఉపయోగపడుతుంది. తాత్కాలిక ఉపశమనానికి మాత్రలపై ఆధారపడే బదులు నిద్ర నాణ్యతను మెరుగుపరిస్తే శరీరం సహజంగానే కోలుకునే శక్తిని పెంచుకుంటుంది. నొప్పిని తగ్గించడంలోనే కాదు, మానసిక ప్రశాంతతను పెంచడంలో, రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో, రోజువారీ జీవితాన్ని ఉత్సాహంగా కొనసాగించడంలో మంచి నిద్ర కీలక పాత్ర పోషిస్తుంది. అందుకే నిద్రను నిర్లక్ష్యం చేయకుండా రోజువారీ ఆరోగ్య అలవాట్లలో భాగంగా మార్చుకోవాలని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

### నిద్ర శరీరంలో చేసే మార్పులు

**నిద్ర విశ్రాంతి మాత్రమే కాదు:** శరీర కణాల మరమ్మతు, హార్మోన్ల సమతుల్యత, రోగనిరోధక శక్తి పెంపు, మెదడు పనితీరుకు నిద్ర అత్యంత అవసరం.

నిద్ర-నొప్పి విడదీయలేని బంధం: దీర్ఘకాలిక నొప్పి నిద్రను దెబ్బతీస్తుంది. నిద్రలేమి మరుసటి రోజు నొప్పిని మరింత పెంచుతుంది.

**భారత్‌లో నిద్ర సంక్షోభం:** దాదాపు 59% మంది భారతీయులు రోజుకు ఆరు గంటల కంటే తక్కువ నిద్రపోతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి.

నిద్రలేమి ప్రభావం: వెన్నునొప్పి, మెడ నొప్పి, కీళ్ల నొప్పులు, తలనొప్పి, గాయాల తర్వాత వచ్చే నొప్పులు మరింత తీవ్రమవుతాయి.

**మెదడుపై ప్రభావం:** నిద్రలేమి నొప్పిని నియంత్రించే సహజ వ్యవస్థను బలహీనపరుస్తుంది. చిన్న నొప్పి కూడా ఎక్కువగా అనిపించే పరిస్థితి ఏర్పడుతుంది.

శరీరంలో మార్పులు: ఒత్తిడి హార్మోన్లు పెరుగుతాయి. వాపు అధికమవుతుంది. గాయాలు మానడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఎండోర్ఫిన్ల ఉత్పత్తి తగ్గుతుంది.

**మందులతోనే పరిష్కారం కాదు:** మంచి నిద్ర వల్ల నొప్పి తీవ్రత తగ్గే అవకాశం ఉంది. నిద్రలేమి ఉంటే నొప్పి మందుల ప్రభావం కూడా తగ్గవచ్చు.

ఎవరికి ఎక్కువ ప్రమాదం: ఆర్థరైటిస్, మధుమేహ నరాల నొప్పులు, ఫైబ్రోమైయాల్జియా, వెన్నునొప్పి, మెడ నొప్పి, క్యాన్సర్‌కు సంబంధించిన నొప్పులతో బాధపడేవారు నిద్రపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.

మంచి నిద్ర కోసం: సమయానికి నిద్రపోవాలి. వ్యాయామం చేయాలి. రాత్రివేళ మొబైల్ వినియోగం తగ్గించాలి. కాఫీ, మద్యం వంటి ఉత్తేజకాలకు దూరంగా ఉండాలి. యోగా, ధ్యానం అలవాటు చేసుకోవాలి.

**వైద్యుల సూచన:** దీర్ఘకాలిక నొప్పి చికిత్సలో మందులతో పాటు నిద్ర నాణ్యతను మెరుగుపరచడం కూడా తప్పనిసరి. మంచి నిద్రే సహజమైన, దుష్ప్రభావాలు లేని ఉత్తమ నొప్పి నివారిణిగా నిపుణులు సూచిస్తున్నారు.

### • శరీరానికి నిద్ర ఎంత అవసరమేంటి?

ఈ కథలో హీరో మందు కాదు... నిద్ర. విలన్ వ్యాధి కాదు... నిద్రలేమి. శరీరం ప్రతిరోజూ మనకు సంకేతాలు ఇస్తూనే ఉంటుంది. తలనొప్పి, వెన్నునొప్పి, మెడ నొప్పి, కీళ్ల నొప్పి, అలసట, చిరాకు... ఇవన్నీ కేవలం వ్యాధుల లక్షణాలు కాకపోవచ్చు. ప్రశాంతమైన నిద్ర కోసం శరీరం చేసే హెచ్చరికలు కూడా కావచ్చు. మనం వాటిని నిర్లక్ష్యం చేస్తే ఒక్కో రోజు ఒక్కో మాత్ర పెరుగుతుంది. ఒక్కో నెల ఒక్కో పరీక్ష పెరుగుతుంది. చివరకు ఆరోగ్యమే చేతులు ఎత్తే పరిస్థితి వస్తుంది. కానీ ఒక చిన్న మార్పు ఈ కథను పూర్తిగా మార్చగలదు. సమయానికి నిద్రపోవడం, మొబైల్‌కు దూరంగా ఉండడం, ఒత్తిడిని తగ్గించడం, శరీరానికి విశ్రాంతి ఇవ్వడం. ఇవి అలవాట్లు మాత్రమే కాదు... ఆరోగ్యానికి పెట్టుబడి. జీవితంలో ప్రతి విజయానికి పునాది శ్రమ అయితే, ఆ శ్రమను నిలబెట్టే అసలైన శక్తి నిద్ర. కాబట్టి ఈ రాత్రి నుంచి ఒక నిర్ణయం తీసుకోండి... నిద్రకు సమయం కేటాయించండి. ఎందుకంటే మంచి నిద్రే శరీరానికి సహజ వైద్యుడు... జీవితానికి నిజమైన రక్షకుడు.

## నిద్రలేమి ఎలా జీవితాన్ని మార్చేస్తుందంటే..!

### హైదరాబాద్: రాత్రి ఉద్యోగం.. పగలు నిద్ర లేదు

హైదరాబాద్‌లోని ఓ ఐటీ ఉద్యోగి అమెరికా షిఫ్ట్‌లో పనిచేస్తున్నాడు. రాత్రంతా కంప్యూటర్ ముందే గడుస్తోంది. ఉదయం ఇంటికి వెళ్లినా పగలు గాఢ నిద్ర పట్టడం లేదు. కొద్ది నెలల్లోనే మెడ నొప్పి, వెన్నునొప్పి, తలనొప్పి మొదలయ్యాయి. ఇప్పుడు ప్రతి రోజు పెయిన్‌కిల్లర్ లేకుండా కార్యాలయానికి వెళ్లలేని పరిస్థితి వచ్చింది. అసలు సమస్య నొప్పి కాదు.. నిద్రలేమే అని వైద్యులు గుర్తించారు.

### విశాఖపట్నం: మొబైల్‌తోనే అర్ధరాత్రి వరకు.. ఉదయం శరీరం మొత్తం నొప్పులు


విశాఖలో డిగ్రీ చదువుతున్న ఓ యువకుడు రాత్రి రెండు గంటల వరకు మొబైల్‌లో రీల్స్ చూస్తూ గడుపుతున్నాడు. నిద్ర ఆలస్యమవుతోంది. ఉదయం కళాశాలకు వెళ్లే సమయానికి కళ్ల కింద నల్లటి వలయాలు, తలనొప్పి, చిరాకు, ఏకాగ్రత లోపం మొదలయ్యాయి. పరీక్షల సమయంలో ఒత్తిడి పెరగడంతో నిద్ర పూర్తిగా దెబ్బతింది. ఇప్పుడు చిన్న తలనొప్పి కూడా భరించలేని స్థాయికి చేరుకుంది.

### తిరుపతి: నిద్ర రావడం లేదు.. కీళ్ల నొప్పి పెరుగుతోంది

తిరుపతిలో 58 ఏళ్ల మహిళకు మోకాళ్ల నొప్పి ఉంది. నొప్పి వల్ల రాత్రి పలుమార్లు మెలకువ వస్తోంది. గాఢ నిద్ర లేకపోవడంతో మరుసటి రోజు నొప్పి మరింత పెరుగుతోంది. మందులు వేసుకున్నా పూర్తి ఉపశమనం రావడం లేదు. చివరకు వైద్యులు నిద్ర సమస్యను కూడా చికిత్సలో భాగం చేయడంతోనే పరిస్థితి క్రమంగా మెరుగైంది.

### వరంగల్: అప్పుల ఆందోళన.. గుండె దడ.. నిద్ర మాయం

వరంగల్ జిల్లాకు చెందిన ఓ రైతు వరుస పంట నష్టాలు, అప్పుల భారం వల్ల తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉన్నాడు. రాత్రంతా నిద్ర పట్టడం లేదు. ఉదయం లేవగానే శరీరం మొత్తం నొప్పులు, నడుము బిగుసుకుపోవడం, అలసట వేధిస్తున్నాయి. పరీక్షలు చేయించుకుంటే పెద్ద వ్యాధి ఏదీ కనిపించలేదు. ఒత్తిడి వల్ల వచ్చిన నిద్రలేమే శారీరక నొప్పులను పెంచిందని వైద్యులు చెప్పారు.





### ఇది నలుగురి కథ కాదు.. కోట్ల మంది భారతీయుల పరిస్థితి

ఐటీ ఉద్యోగి కావచ్చు.. విద్యార్థి కావచ్చు.. గృహిణి కావచ్చు.. రైతు కావచ్చు. జీవితం వేరు.. సమస్య వేరు. కానీ అందరినీ కలిపే ఒకే కారణం నిద్రలేమి. సరైన నిద్ర లేకపోతే శరీరం నొప్పిని ఎక్కువగా అనుభవిస్తుంది. నొప్పి పెరిగితే మళ్లీ నిద్ర దూరమవుతుంది. ఈ దుష్చక్రాన్ని విరమించడానికి మంచి నిద్రే మొదటి చికిత్స అని నిద్ర నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# డీల్ కోసం ఇరాన్ అడుక్కుంటోంది

### వీడియో సందేశంతో ట్రంప్ వార్నింగ్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ కొత్త వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఇరాన్‌లోని లక్ష్యాలపై అమెరికా సైన్యం జరిపిన దాడుల దృశ్యాలను షేర్ చేస్తూ, అవసరమైతే మరింత భారీ దాడులకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఇరాన్ ఇప్పుడు ఒప్పందం కోసం ఆత్రుతగా ప్రయత్నిస్తోందని, డీల్ కోసం వేడుకుంటోందని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే అలాంటి ఒప్పందాన్ని ఇరాన్ నిజాయితీగా పాటిస్తుందనే నమ్మకం తనకు లేదని కూడా చెప్పారు.

### ఇరాన్‌పై వరుస దాడులు



అమెరికా సైన్యం వరుసగా రెండో రోజు కూడా ఇరాన్‌పై దాడులు కొనసాగించింది. ఇరాన్ ఆగ్నేయ ప్రాంతంలోని ఇరాన్‌షహర్ వైమానిక స్థావరంతో పాటు పలు కీలక ప్రాంతాలపై దాడులు జరిగినట్లు సమాచారం. బుషెహర్, బందర్ అబ్బాస్, చాబహర్, కొనారక్, సిరిక్ ప్రాంతాల్లో భారీ పేలుళ్లు సంభవించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. ఈ దాడులతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు మరింత పెరిగాయి.

### ట్రంప్ ఘాటు హెచ్చరికలు

ఇరాన్ హోర్ముజ్ జలసంధిలో నౌకలపై దాడులు చేస్తే అమెరికా దానికి ఇరవై రెట్లు బలంగా ప్రతిస్పందిస్తుందని ట్రంప్ హెచ్చరించారు. అవసరమైతే ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, సముద్రపు నీటిని తాగునీటిగా మార్చే ప్లాంట్లు, చమురు ఉత్పత్తి కేంద్రాలపై కూడా దాడులు జరగొచ్చని సంకేతాలు ఇచ్చారు. పరిస్థితులు చాలా వేగంగా మారే అవకాశం ఉందని పేర్కొంటూనే, చర్చలకు తలుపులు పూర్తిగా మూసేయలేదని వెల్లడించారు.

### ఇరాన్ నుంచి ప్రతిదాడులు

అమెరికా దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ కూడా బహ్రెయిన్, కువైట్, ఖతార్ దిశగా క్షిపణులు, డ్రోన్లతో దాడులకు ప్రయత్నించినట్లు అంతర్జాతీయ మీడియా తెలిపింది. కువైట్ సైన్యం వాటిని అడ్డుకున్నట్లు సమాచారం. హోర్ముజ్ జలసంధి నిర్వహణ తమ నియంత్రణలోనే ఉంటుందని ఇరాన్ ప్రకటించింది. బెదిరింపులతో తమను వెనక్కి తగ్గించలేరని, దాడి చేస్తే ప్రతిదాడి తప్పదని ఇరాన్ నాయకత్వం స్పష్టం చేసింది.

### మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తత

అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధ వాతావరణం రోజు రోజుకూ మరింత తీవ్రమవుతోంది. ఒకవైపు ట్రంప్ వరుస హెచ్చరికలు చేస్తుండగా, మరోవైపు ఇరాన్ కూడా అదే స్థాయిలో ప్రతిస్పందిస్తోంది. ఈ పరిణామాల ప్రభావం అంతర్జాతీయ చమురు మార్కెట్లపై ఇప్పటికే కనిపిస్తోంది. యుద్ధం మరింత విస్తరించే అవకాశం ఉందనే ఆందోళన ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమవుతోంది. దౌత్య చర్చలు ఫలిస్తాయా, లేక పరిస్థితి మరో పెద్ద ఘర్షణకు దారితీస్తుందా అన్నది ఇప్పుడు ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.



# నెట్ పరీక్ష కలకలం

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే
- విద్యాశాఖ మంత్రిపై రాహుల్ దూకుడు
- యూజీసీ-నెట్ వివాదంపై రాజకీయ వేడి

యూజీసీనెట్ 2026 పరీక్షలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు దేశ రాజకీయాల్లో మరోసారి చర్చకు దారితీశాయి. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని తీవ్రంగా లక్ష్యంగా చేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ ఎన్‌టీఏను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేసింది. వరుసగా జాతీయ స్థాయి పరీక్షల్లో వివాదాలు తలెత్తుతున్నా కేంద్ర ప్రభుత్వం సమర్థవంతంగా స్పందించడం లేదని కాంగ్రెస్ ఆరోపించింది.

### సోషియాలజీ పరీక్షపై లీక్ ఆరోపణలు

జూన్ 30న నిర్వహించిన యూజీసీనెట్ సోషియాలజీ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ అయిందని కొందరు విద్యార్థులు ఆరోపించినట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ పేర్కొన్నారు. ఇటీవల నీట్‌యూజీ ప్రశ్నపత్రం లీక్ ఘటన తర్వాత కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహిస్తామని కేంద్రం ప్రకటించిందని గుర్తు చేశారు. సీబీటీ విధానంలో పరీక్షలు నిర్వహిస్తే లీక్‌లకు అవకాశం ఉండదని చెప్పినా ఇప్పుడు అదే విధానంలో నిర్వహించిన నెట్ పరీక్షపైనా అనుమానాలు రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. గతంలో యూజీసీనెట్ ఇంగ్లిష్ ప్రశ్నపత్రంలో పాత ప్రశ్నలను మార్పులు లేకుండా ఉపయోగించారని కూడా ఆయన ఆరోపించారు.

### రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు

లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా ఈ వ్యవహారంపై తీవ్ర విమర్శలు చేశారు. లక్షలాది మంది విద్యార్థులు సంవత్సరాల పాటు కష్టపడి పరీక్షలకు సిద్ధమవుతున్నా వారి భవిష్యత్తు పట్ల కేంద్ర ప్రభుత్వానికి బాధ్యత కనిపించడం లేదని అన్నారు. పరీక్షకు ముందు వంద పేజీల పీడీఎఫ్ బయటకు వచ్చిందని, అందులోని దాదాపు 90 ప్రశ్నలు అసలు సోషియాలజీ ప్రశ్నపత్రంతో సరిపోలుతున్నాయని వస్తున్న ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పరీక్షల విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయని విమర్శించారు.

### ప్రధాని మౌనం ఎందుకని ప్రశ్న

పరీక్షల లీకేజీలపై ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు స్పందించడం లేదని కాంగ్రెస్ ప్రశ్నించింది. పరీక్షల నిర్వహణ విధానం మారినా సమస్యలు మాత్రం అలాగే కొనసాగుతున్నాయని పేర్కొంది. పెన్‌పేపర్ విధానంలో ఆరోపణలు వచ్చాయి. ఇప్పుడు కంప్యూటర్ ఆధారిత పరీక్షలపైనా అదే పరిస్థితి కనిపిస్తోందని విమర్శించింది. పరీక్షల నిర్వహణలో పారదర్శకత తీసుకురావాలంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

### ఎన్‌టీఏ స్పందన కోసం ఎదురుచూపు

కాంగ్రెస్ చేసిన ఆరోపణలపై జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ ఎన్‌టీఏ నుంచి వెంటనే ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. నీట్, యూజీసీనెట్ వంటి జాతీయ స్థాయి పరీక్షలపై ఇప్పటికే విద్యార్థుల్లో ఆందోళన నెలకొన్న సమయంలో తాజా ఆరోపణలు మరింత చర్చకు దారితీశాయి. ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏ ఎలాంటి వివరణ ఇస్తాయి, విచారణకు ఆదేశిస్తాయా లేదా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. పరీక్షలపై విద్యార్థుల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు కేంద్రం తీసుకునే చర్యలపైనే ఇప్పుడు అందరి దృష్టి నిలిచింది.

# టిట్ ఫర్ ట్యాట్

- మారుతున్న జెన్ జీ మైండ్ సెట్..
- డిఫెన్స్‌లో మేనేజ్మెంట్
- కార్పొరేట్ ప్రపంచానికి తలబొప్పి
- సంస్థలకు పెరుగుతున్న సవాళ్లు



సంస్థ ఎలా ఉంటే.. ఉద్యోగులు కూడా అలానే మారతారు. ఒకప్పుడు అదనపు పని చేస్తేనే ఎదుగుదల వస్తుందని భావించిన ఉద్యోగ సంస్కృతి ఇప్పుడు వేగంగా మారుతోంది. పని పూర్తయితే చాలు.. మిగతా సమయం వ్యక్తిగత జీవితానికే కేటాయించాలనే ఆలోచన కొత్త తరంలో బలపడుతోంది. ఉద్యోగం కోసం జీవించడం కాదు.. జీవితం కోసం ఉద్యోగం చేయాలన్న భావన జెన్ జీ ఉద్యోగుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఫలితంగా సంస్థ కోసం అదనపు బాధ్యతలు తీసుకోవడం, కార్యాలయ సమయం దాటి పని చేయడం, కొత్త పనులకు స్వచ్ఛందంగా ముందుకు రావడం వంటి ధోరణి క్రమంగా తగ్గుతోంది. ఆశ్చర్యకరంగా కార్యాలయ వాతావరణం మెరుగుపడుతున్నా, ఉద్యోగుల నిబద్ధత మాత్రం అదే స్థాయిలో పెరగడం లేదు. ఏఐ రాక, పని ఒత్తిడి, మారుతున్న జీవన విలువలు ఈ మార్పుకు ప్రధాన కారణాలుగా మారాయి. దీంతో ఉద్యోగుల ఆలోచనలను అర్థం చేసుకోవడం, వారికి అర్థవంతమైన పని వాతావరణాన్ని కల్పించడం సంస్థలకు కొత్త సవాల్‌గా మారింది. కంపెనీల నాయకత్వం ఎలా స్పందిస్తుందో.. రానున్న రోజుల్లో అదే ఉద్యోగుల పనితీరు, సంస్థల విజయాన్ని నిర్ణయించే కీలక అంశంగా నిలవనుంది.

భారత కార్పొరేట్ ప్రపంచంలో ఉద్యోగుల పని తీరు వేగంగా మారుతోంది. ఒకప్పుడు ఉద్యోగులు తమ బాధ్యతలకు మించి అదనపు పనులు చేయడానికి ముందుకు వచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి క్రమంగా తగ్గుతోంది. ఈ ధోరణిని "ఎఫర్ట్ రిసెషన్"గా పేర్కొంటున్నారు. గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇండియా విడుదల చేసిన తాజా అధ్యయనం ప్రకారం దేశంలోని దాదాపు 63 శాతం సంస్థలు ఉద్యోగులు ఇకపై అదనపు బాధ్యతలు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదని వెల్లడించాయి. తమకు కేటాయించిన పని మాత్రమే పూర్తి చేస్తున్నారని, సంస్థ అభివృద్ధి కోసం అదనంగా శ్రమించే వారి సంఖ్య తగ్గుతోందని నివేదిక పేర్కొంది.

### జెన్ జీ ప్రభావమే ప్రధాన కారణం

ఈ మార్పుకు ప్రధాన కారణంగా జెన్ జీ ఉద్యోగుల సంఖ్య పెరగడాన్ని అధ్యయనం గుర్తించింది. 2023లో భారత ఉద్యోగుల్లో జెన్ జీ వాటా 13 శాతంగా ఉండగా, ఇప్పుడు అది 26 శాతానికి చేరింది. ఐటీ, బ్యాంకింగ్, తయారీ, ఔషధ రంగం, ఆరోగ్య సేవలు, రిటైల్, నిర్మాణ రంగాల్లో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. కొత్త తరం ఉద్యోగులు ఎక్కువ జీతం కంటే పని-వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత, అర్థవంతమైన పని, పారదర్శక పదోన్నతులు, స్పష్టమైన లక్ష్యాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని నివేదిక తెలిపింది.

### ఉద్యోగుల ఆలోచనల్లో మార్పు

ప్రస్తుతం ఉద్యోగులు తమకు అప్పగించిన బాధ్యతలను పూర్తి చేస్తున్నప్పటికీ, అదనపు పనులు స్వచ్ఛందంగా చేయడానికి ముందుకు రావడం తగ్గిపోయింది. కొత్త ఆలోచనలు చెప్పడం, కార్యాలయ సమస్యల పరిష్కారంలో అదనపు పాత్ర పోషించడం, ఎక్కువ గంటలు పనిచేయడం వంటి అంశాల్లో ఆసక్తి తగ్గిందని అధ్యయనం వెల్లడించింది. ఆశ్చర్యకరంగా కార్యాలయ వాతావరణం, ఉద్యోగి సంక్షేమం, సౌకర్యాలు గతంతో పోలిస్తే మెరుగుపడినా ఉద్యోగుల నిబద్ధత అదే స్థాయిలో పెరగలేదని నివేదిక పేర్కొంది.

### ఏఐతో పెరుగుతున్న ఒత్తిడి

కృత్రిమ మేధస్సు విస్తరణ కూడా ఉద్యోగులపై కొత్త ఒత్తిడిని తీసుకొస్తోందని అధ్యయనం తెలిపింది. అనేక సంస్థలు ఏఐను వేగంగా అమలు చేస్తున్నప్పటికీ, దాని ప్రభావాన్ని సరైన విధంగా అంచనా వేయలేకపోతున్నాయి. సాంకేతికత వల్ల పని వేగం పెరగడం, గడువులు తగ్గిపోవడం, పనితీరు అంచనాలు పెరగడం ఉద్యోగుల్లో మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయని నివేదిక హెచ్చరించింది. సాంకేతికత పని భారాన్ని తగ్గించాల్సిన చోట మరింత ఒత్తిడిని సృష్టిస్తోందనే భావన ఉద్యోగుల్లో పెరుగుతోందని వివరించింది.

### నాయకత్వమే విజయానికి కీలకం

ఉద్యోగుల్లో నిబద్ధత పెరగాలంటే కఠిన లక్ష్యాలు, అదనపు ప్రోత్సాహకాలు మాత్రమే సరిపోవని అధ్యయనం స్పష్టం చేసింది. ఉద్యోగులతో నమ్మకం పెంచే నాయకత్వం అత్యంత కీలకమని పేర్కొంది. ఉద్యోగుల అభిప్రాయాలను వినే, ప్రోత్సహించే, అండగా నిలిచే నాయకత్వం ఉన్న సంస్థల్లో ఉత్పాదకత 47 శాతం, చురుకుదనం 56 శాతం, ఆవిష్కరణలు 34 శాతం, వినియోగదారుల సంతృప్తి 52 శాతం వరకు ఎక్కువగా నమోదైనట్లు అధ్యయనం వెల్లడించింది.

### కొన్ని రంగాల్లో ప్రభావం ఎక్కువ

అన్ని రంగాల్లో ఈ మార్పు ఒకే స్థాయిలో కనిపించడం లేదు. ఐటీ, ప్రొఫెషనల్ సర్వీసులు, నిర్మాణం, మౌలిక వసతులు, రియల్ ఎస్టేట్ రంగాల్లో ఉద్యోగుల అదనపు కృషి గణనీయంగా తగ్గినట్లు నివేదిక పేర్కొంది. తయారీ రంగం మాత్రం ఈ విషయంలో కొంత స్థిరంగా కొనసాగుతోందని తెలిపింది. భవిష్యత్తులో సాంకేతికత సాధారణ పనులను చేపట్టినా, సంస్థ విజయాన్ని నిర్ణయించేది ఉద్యోగుల నిబద్ధతేనని అధ్యయనం స్పష్టం చేసింది. ఉద్యోగులు తమ పనిని అర్థవంతంగా భావించే వాతావరణాన్ని సృష్టించడం సంస్థల ముందున్న అతిపెద్ద సవాల్‌గా మారిందని నివేదిక తేల్చింది.

# కట్టలు తెగిన కవితమ్మ కోపం

- ఆంబోతులు.. అడ్డ గాడిదలు
- అన్నా, బావలపై శాపనార్థాలు



తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్ పార్టీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజా సమస్యలపై పోరాటంలో తమతో పోటీ పడాలని సవాల్ విసిరారు. తాము కొత్త పార్టీ పెట్టుకుంటే బీఆర్ఎస్ నేతలు చాటుమాటుగా ఎన్నికల సంఘానికి ఎందుకు ఫిర్యాదులు చేస్తున్నారని ప్రశ్నించారు. తమ పార్టీ వార్తలను కవర్ చేయకుండా కేటీఆర్, హరీశ్ రావు పత్రికలు, టీవీలపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. ఓ ఆడబిడ్డ ధైర్యంగా ప్రజల్లోకి వెళ్తుంటే ఆంబోతులు, అడ్డగాడిదల్లా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు మళ్లీ బిఆర్ఎస్ పార్టీలోకి వెళ్లే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

### ప్రజల ఆశీర్వాదమే శ్రీరామరక్ష

తెలంగాణ రక్షణ సేన అనే పేరు తాము పెట్టుకున్నది కాదని, ఎన్నికల సంఘం పంపిన పేర్లలో ఒకటని కవిత వివరించారు. ఈ పేరును పోగొట్టేందుకు బీఆర్ఎస్ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. దేవుడు, న్యాయం తన వైపే ఉన్నాయని, అంతిమంగా విజయం తనదేనని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ పేరు ఏదైనా ప్రజల ఆశీర్వాదం ముఖ్యమని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో సంస్కారం లేకుండా అడ్డగోలుగా కామెంట్స్ చేస్తే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. అతి చేస్తే కాళ్లు విరగ్గొడతామని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. కేటీఆర్ కోట్లాది రూపాయలతో ఓ ఇంగ్లీష్ న్యూస్ పేపర్ కొనుగోలు చేశారని ఆరోపించారు.

### ఆ పార్టీ ఎప్పటికీ బాగుపడదు

బీఆర్ఎస్ పార్టీని జోడెద్దుల్లా నడపాల్సిన కేటీఆర్, హరీశ్ రావు దున్నపోతుల్లా మారారని కవిత విమర్శించారు. వారు ప్రజల సమస్యలను విస్మరించి అవినీతి పరులను కాపాడటమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. తనను అడ్డుకోవడానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి నాటకాలు ఆడుతున్నాయన్నారు. అవినీతికి కారణమైన హరీశ్ రావును ఇంకా ముందు పెట్టడం వల్లే ఆ పార్టీ భవిష్యత్తులో బాగుపడదన్నారు. కేసీఆర్‌కు అవినీతి మరకలు అంటించింది చాలదన్నట్లు, హరీశ్ రావు మళ్లీ నీటిపారుదల శాఖ మంత్రి పదవి అడగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతికి హరీశ్ రావు ప్రధాన కారణమని దుయ్యబట్టారు.

### అవినీతి సొమ్మును పంచాలి

బిఆర్ఎస్ పార్టీ ఖాతాలో ఉన్న రూ.1400 కోట్ల అవినీతి సొమ్ముపై విచారణ జరిపించాలని కవిత డిమాండ్ చేశారు. ఆ నిధులను ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు పంపిణీ చేయాలన్నారు. కేటీఆర్, హరీశ్ రావు ఫీనిక్స్ అనే సంస్థను పెంచి పోషించారని మండిపడ్డారు. తెలంగాణ విలువైన భూములను ఆ సంస్థకు పంచిపెట్టారని ఆరోపించారు. హైదరాబాద్ నడిబొడ్డున పెద్ద ఎత్తున కలపను కొట్టేసినా చర్యలు తీసుకోలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వాలు ఇచ్చిన ధార్మిక, ప్రభుత్వ భూములపై పూర్తిస్థాయిలో రివ్యూ జరిపి, అవినీతి సొమ్మును కక్కిస్తామని కవిత స్పష్టం చేశారు.



# జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం గాలింపు

- కొండ ప్రాంతంలో జల్లెడ
- కుటుంబానికి కలెక్టర్ భరోసా

కాకినాడ జిల్లా తుని మండలం సీహెచ్ అగ్రహారం గ్రామానికి చెందిన చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యమైన ఘటన జిల్లాలో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. జూన్ 6 నుంచి కనిపించకుండా పోయిన చిన్నారి ఆచూకీ కోసం జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ హరిందిర ప్రసాద్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. చిన్నారి కోసం జరుగుతున్న గాలింపును మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా చిన్నారి ఇంటి వెనుక ఉన్న కొండ ప్రాంతాన్ని మరోసారి పూర్తిస్థాయిలో జల్లెడ పట్టనున్నట్లు ప్రకటించారు. ఆ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉన్న స్థానికులను కూడా గాలింపు బృందంలో భాగం చేయనున్నట్లు తెలిపారు.

### ప్రతి అంగుళం పరిశీలిస్తాం

జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం ఎలాంటి అవకాశం వదిలిపెట్టబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. కొండ ప్రాంతంలోని ప్రతి అంగుళాన్ని క్షుణ్ణంగా పరిశీలించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని చెప్పారు. గాలింపు చర్యల్లో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని వివరించారు. చిన్నారి ఆచూకీ కోసం అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు. కేసును అత్యంత ప్రాధాన్యంతో పరిశీలిస్తున్నామని, ఆచూకీ లభించే వరకు శోధన ఆపబోమని చెప్పారు. పోలీసు శాఖ, రెవెన్యూ అధికారులు, స్థానిక బృందాలు సమిష్టిగా పనిచేస్తున్నాయని తెలిపారు.

### కుటుంబానికి అండగా ప్రభుత్వం

ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం కుటుంబానికి పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని కలెక్టర్ హరిందిర ప్రసాద్ భరోసా ఇచ్చారు. అవసరమైన ఆర్థిక సహాయాన్ని కూడా త్వరలో అందజేస్తామని హామీ ఇచ్చారు. చిన్నారి సురక్షితంగా తిరిగి రావాలని కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులు ఆశగా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఘటన జిల్లావ్యాప్తంగా ఆందోళన కలిగించిందని, ప్రతి పరిణామాన్ని అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారని తెలిపారు. ప్రజలు వదంతులను నమ్మకుండా అధికారులకు సహకరించాలని సూచించారు. జ్ఞానేశ్వరి ఆచూకీ లభించే వరకు గాలింపు చర్యలు నిరంతరంగా కొనసాగుతాయని, ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై భట్టి హామీ

జర్నలిస్టులకు సొసైటీలతో సంబంధం లేకుండా ఇళ్ల స్థలాలు కేటాయించే అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా కమిటీ సమర్పించిన వినతిపత్రంపై ఆయన సానుకూలంగా స్పందించారు. సొసైటీల ద్వారా స్థలాల కేటాయింపులో న్యాయపరమైన సమస్యలు ఉన్నందున, బీపీఎల్ కోటా లేదా ఇతర విధానాల ద్వారా స్థలాలు ఇవ్వడానికి అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై ముఖ్యమంత్రితో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# ధాన్యం సేకరణలో ఏపీ రికార్డు

రాష్ట్రంలో ధాన్యం సేకరణలో కూటమి ప్రభుత్వం రికార్డు నెలకొల్పిందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గత రెండేళ్లలో 74 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రూ.31 వేల కోట్ల విలువతో కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. 11.53 లక్షల మంది రైతులకు 95 శాతం చెల్లింపులు 24 గంటల్లోనే ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. క్యూఆర్ కోడ్, వాట్సాప్ నమోదు, ట్రాక్ అండ్ ట్రేస్ వంటి సాంకేతిక సంస్కరణలతో పారదర్శకత పెరిగిందన్నారు. ఎల్‌నినో ప్రభావంపై రైతులకు ముందస్తు అవగాహన కల్పించి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. రైతులకు మరింత వేగవంతమైన సేవలే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# బందరులో ప్రతి ఇంటికీ తాగునీరు: కొల్లు రవీంద్ర

బందరు నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి ఏర్పాటు చేయడమే లక్ష్యమని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మచిలీపట్నం రూరల్ మండలం క్యాంబెల్‌పేటలో తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జల్ జీవన్ మిషన్ కింద రూ.200 కోట్లతో ప్రతి ఇంటికీ తాగునీటి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. గ్రామాల్లో రోడ్లు, విద్యుత్, ఇతర మౌలిక వసతులను మెరుగుపరుస్తామని వెల్లడించారు. ప్రజలు ఓటు వేసి గెలిపించిన రుణాన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా తీర్చుకుంటానని పేర్కొన్నారు. బందరు అభివృద్ధిని రాష్ట్రంలో ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తానని మంత్రి స్పష్టం చేశారు.

# స్కీంలపై పొలిటికల్ స్టంట్

- హైకోర్టు లా పాయింట్
- చట్టబద్ధతపై సందేహాలు
- ప్రభుత్వానికి కీలక ఆదేశాలు

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత సంక్షేమ పథకాలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. శాసన సభ ఆమోదం లేకుండా ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలను ఎలా అమలు చేస్తున్నారని ప్రశ్నించింది. ఈ పథకాల చట్టబద్ధతపై దాఖలైన రిట్ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం, పూర్తి వివరాలతో కూడిన అఫిడవిట్‌ను నాలుగు వారాల్లో సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రజలకు సంక్షేమం అందించడం ప్రభుత్వ విధాన నిర్ణయమే అయినా, దానికి చట్టపరమైన ఆధారం ఉండాలని కోర్టు స్పష్టం చేసింది. అదే సమయంలో ఈ పథకాలపై వెంటనే స్టే విధించడానికి మాత్రం నిరాకరించింది. తదుపరి విచారణను ఆగస్టు 5కు వాయిదా వేసింది.

### ఉద్యోగుల బకాయిలపై తీవ్ర ఆందోళన

రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాట్యుటీ, పదవీ విరమణ ప్రయోజనాలు పెండింగ్‌లో ఉండగా ఉచిత పథకాలపై భారీగా నిధులు ఖర్చు చేయడంపై కూడా హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. నాలుగు దశాబ్దాల పాటు ప్రభుత్వానికి సేవలందించిన ఓ రిటైర్డ్ అసిస్టెంట్ ఇంజనీర్ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ నాగేశ్ భీమపాక ఈ వ్యాఖ్యలు చేశారు. ఉచిత విద్యుత్, ఉచిత నీరు, ఉచిత రవాణా, రుణమాఫీలు, సబ్సిడీలకు నిధులు కేటాయిస్తున్న ప్రభుత్వం ఉద్యోగుల చట్టబద్ధ బకాయిలు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. ఆలస్యంగా చెల్లించే గ్రాట్యుటీపై వడ్డీ చెల్లించాల్సిందేనని చట్టం చెబుతోందని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల నమ్మకాన్ని దెబ్బతీసే పరిస్థితులు రావద్దని హెచ్చరించారు.



### సంక్షేమం ఉండాలి..
### ఆర్థిక క్రమశిక్షణ కూడా అవసరం

విచారణ సందర్భంగా ప్రభుత్వ ఆర్థిక ప్రాధాన్యతలపై కూడా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఉద్యోగుల జీతాలు ఆలస్యం కావడం, కాంట్రాక్టర్ల బిల్లులు పెండింగ్‌లో ఉండటం, భూసేకరణ పరిహారం చెల్లింపులు నిలిచిపోవడం వంటి అంశాలను ప్రస్తావించింది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వ నిధుల వినియోగంపై సమగ్ర సమీక్ష అవసరమని అభిప్రాయపడింది. పిటిషనర్ తరఫు న్యాయవాది 2014 నుంచి ఈ పథకాల కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారని, అర్హత లేని కొందరు కూడా లబ్ధి పొందినట్లు కాగ్ నివేదికలో ఉందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం మాత్రం పేద కుటుంబాలకు అండగా నిలవడానికే ఈ పథకాలు అమలు చేస్తున్నామని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి స్థిరంగానే ఉందని వాదించింది. సంక్షేమ పథకాల అమలు, ఆర్థిక క్రమశిక్షణ మధ్య సమతుల్యత అవసరమనే సందేశాన్ని హైకోర్టు తన వ్యాఖ్యల ద్వారా స్పష్టం చేసింది.



# బ్రూక్, సాల్ట్ విధ్వంసం
## ఇంగ్లండ్‌కు ఘన విజయం

టీ20 సిరీస్‌లో ఇంగ్లండ్ జట్టు మరోసారి అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. ప్రత్యర్థి నిర్దేశించిన లక్ష్యాన్ని కేవలం 13.5 ఓవర్లలోనే ఛేదించి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 30తో అజేయ ఆధిక్యం సాధించింది. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన ఓపెనర్లు బౌలర్లపై ఎదురుదాడికి దిగడంతో మ్యాచ్ ఏకపక్షంగా మారింది. ప్రత్యర్థి బౌలర్లకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా పరుగుల వరద పారించారు. హ్యారీ బ్రూక్ 79 పరుగులతో అజేయంగా నిలిచి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మరోవైపు ఫిల్ సాల్ట్ 59 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడుతూ బ్రూక్‌కు చక్కటి సహకారం అందించాడు. ఇద్దరూ భారీ షాట్లతో ప్రత్యర్థి బౌలింగ్‌ను పూర్తిగా ఒత్తిడిలోకి నెట్టారు. వీరి భాగస్వామ్యం మ్యాచ్‌ను చాలా త్వరగా ముగించేలా చేసింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లండ్ 30 ఆధిక్యం సాధించి సిరీస్‌ను అధికారికంగా కైవసం చేసుకుంది. ఇంకా రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నప్పటికీ ప్రత్యర్థి జట్టుకు తిరిగి పుంజుకునే అవకాశం లేకుండా చేసింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ అన్ని విభాగాల్లో సమష్టిగా రాణిస్తున్న ఇంగ్లండ్ జట్టు ప్రస్తుతం పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ అభిమానులను ఆకట్టుకుంటోంది.

# మ్యాచ్ ముగిసినా మంట చల్లారలేదు!
## అర్జెంటీనా గెలుపుపై వివాదం





ఫిఫా ప్రపంచకప్ 2026 ప్రీక్వార్టర్‌లో అర్జెంటీనా 32తో ఈజిప్టుపై సాధించిన విజయంపై వివాదం మరింత ముదురుతోంది. రెండు గోల్స్ వెనుకబడి ఉన్న స్థితి నుంచి అర్జెంటీనా అద్భుతంగా పుంజుకుని విజయం సాధించినా, రిఫరీ నిర్ణయాలపై ఈజిప్ట్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. మ్యాచ్ ముగిసిన వెంటనే ఈజిప్ట్ ప్రధాన కోచ్ హొస్సామ్ హసన్ ఫిఫా అధికారులతో తీవ్ర వాగ్వాదానికి దిగిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. అదే సమయంలో అక్కడికి వచ్చిన అర్జెంటీనా కోచ్ లియోనెల్ స్కలోనిపై కూడా హసన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే స్కలోని ఎలాంటి స్పందన ఇవ్వకుండా నేరుగా డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లిపోయారు. మరోవైపు రిఫరీ సరైన విధంగా వీఏఆర్ వినియోగించలేదని ఈజిప్ట్ ఫుట్ బాల్ అసోసియేషన్ అధికారికంగా ఫిర్యాదు చేసింది. మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేసిన కీలక నిర్ణయాలపై సమగ్ర సమీక్ష జరపాలని డిమాండ్ చేసింది. అయితే ఫిఫా రిఫరీయింగ్ విభాగం మాత్రం తమ అధికారుల నిజాయితీపై ఆరోపణలు చేయడం సరికాదని స్పష్టం చేసింది. మ్యాచ్ ముగిసినా ఈ వివాదం మాత్రం ప్రపంచ ఫుట్ బాల్‌లో ఇంకా చర్చనీయాంశంగానే కొనసాగుతోంది.

# సంజూపై అన్యాయం? అశ్విన్ ఆగ్రహం





టీ20 ప్రపంచకప్ 2026లో భారత్‌కు విజయం అందించడంలో కీలక పాత్ర పోషించిన సంజూ శాంసన్‌కు జట్టులో సరైన అవకాశాలు ఇవ్వకపోవడంపై మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వరుసగా ఆటగాళ్లను మార్చే విధానం జట్టుకు ప్రమాదకరమని హెచ్చరించారు. రెండు మ్యాచ్‌లు ఓడిపోయిన వెంటనే సంజూను పక్కన పెట్టడం న్యాయం కాదని ప్రశ్నించారు. టెస్ట్ జట్టులో సాయి సుదర్శన్‌కు దీర్ఘకాల అవకాశం ఇవ్వాలని చెప్పిన ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మాటలను గుర్తు చేస్తూ, అదే విధానం సంజూ విషయంలో ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. నాలుగు మ్యాచ్‌లతో ఆటగాడిని అంచనా వేయకూడదని చెప్పిన వారు ఇప్పుడు సంజూను ఎందుకు పక్కన పెట్టారని ప్రశ్నించారు. ఇలాంటి నిర్ణయాలు ఆటగాళ్లలో అభద్రతా భావాన్ని పెంచుతాయని, జట్టు కోసం కాకుండా తమ స్థానాన్ని కాపాడుకోవడానికే ఆడే పరిస్థితి వస్తుందని అశ్విన్ అభిప్రాయపడ్డారు. అయితే గంభీర్ మాత్రం సంజూ భారత జట్టుకు చేసిన సేవలు గొప్పవేనని, మంచి ఫామ్‌లో ఉన్న మరో ఆటగాడికి అవకాశం ఇచ్చామని, ఈ సిరీస్‌లోనే సంజూ మళ్లీ జట్టులోకి వచ్చే అవకాశం ఉందని స్పష్టం చేశారు.





# ఆఫ్ఘన్ క్రికెటర్‌కు కన్నీటి వీడ్కోలు

ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్‌కు పునాది వేసిన మాజీ ఫాస్ట్ బౌలర్ షపూర్ జద్రాన్ అంత్యక్రియలు కాబూల్‌లో భావోద్వేగ వాతావరణంలో జరిగాయి. అరుదైన రోగం హీమోఫాగోసైటిక్ లింఫోహిస్టియోసైటోసిస్‌తో కొంతకాలంగా చికిత్స పొందుతున్న షపూర్ 38 ఏళ్ల వయసులో మృతి చెందారు. ఆయన మృతదేహానికి నివాళులర్పించేందుకు ఆఫ్ఘన్ క్రికెట్ కుటుంబం పెద్ద సంఖ్యలో హాజరైంది. స్టార్ ఆటగాళ్లు రషీద్ ఖాన్, మహ్మద్ నబీ, హష్మతుల్లా షాహిదీ భావోద్వేగాలను అదుపు చేసుకోలేక కన్నీటి పర్యంతమయ్యారు. 2009 నుంచి 2020 వరకు ఆఫ్ఘనిస్తాన్ తరఫున 44 వన్డేలు, 36 టీ20లు ఆడిన షపూర్ మొత్తం 80 అంతర్జాతీయ వికెట్లు తీశారు. 2015 ప్రపంచకప్‌లో స్కాట్లాండ్‌పై ఆఫ్ఘనిస్తాన్ తొలి ప్రపంచకప్ విజయానికి చివరి పరుగులు చేసి చరిత్ర సృష్టించారు. షపూర్ సేవలను ఎప్పటికీ మరచిపోలేమని ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు నివాళులర్పించింది. ఆయన కృషే ఆఫ్ఘన్ క్రికెట్‌ను ప్రపంచ వేదికపై నిలబెట్టిందని పేర్కొంది. షపూర్ మృతి ఆ దేశ క్రికెట్‌కు తీరని లోటుగా అభిమానులు అభివర్ణిస్తున్నారు.




# భారీ బడ్జెట్ చిత్రంగా టాక్సిస్

కేజీఎఫ్' సిరీస్‌తో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన యశ్ ప్రస్తుతం నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'టాక్సిస్'. మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా ప్రారంభం నుంచే భారీ అంచనాలు నెలకొల్పింది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని అత్యున్నత నిర్మాణ విలువలతో రూపొందిస్తున్నారు. సినిమా నిర్మాణ వ్యయం దాదాపు రూ.500 కోట్లకు పైగా ఉంటుందని ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. యాక్షన్, హింసాత్మక నేపథ్యం, భారీ విజువల్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన రెండు గ్లింప్స్‌తో పాటు ఒక పాటకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. తాజాగా ఈ సినిమా బడ్జెట్‌కు సంబంధించిన మరో ఆసక్తికర విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ప్రచారం ప్రకారం, మొత్తం బ్జడెట్‌లో దాదాపు రూ.100 కోట్లు ప్రధాన తారాగణం, దర్శకురాలు, కీలక సాంకేతిక నిపుణుల రెమ్యునరేషన్లకే వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. హీరో యశ్ ఈ సినిమా కోసం సుమారు రూ.50 కోట్ల పారితోషికం తీసుకుంటున్నారని, అంతేకాకుండా సినిమా లాభాల్లో కూడా వాటా ఉండేలా ఒప్పందం చేసుకున్నారని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇక చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న కియారా అద్వానీకి సుమారు రూ.15 కోట్లు పారితోషికంగా అందుతున్నట్లు సమాచారం. కీలక పాత్రలో కనిపించనున్న నయనతారకు రూ.12 కోట్లు, మరో ముఖ్యమైన పాత్రలో నటిస్తున్న రుక్మిణి వసంత్‌కి రూ.3 కోట్లు ఇస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. అలాగే తారా సుతారియా, హ్యూమా ఖురేషిలకు చెరో రూ.2 కోట్ల వరకు పారితోషికం చెల్లిస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. దర్శకురాలు గీతూ మోహన్‌దాస్‌తో పాటు ఇతర కీలక సాంకేతిక నిపుణుల పారితోషికాలు కలిపితే మొత్తం రెమ్యునరేషన్ వ్యయం రూ.100 కోట్ల మార్క్‌ను దాటే అవకాశముందని చర్చ జరుగుతోంది. కేవలం నటీనటుల పారితోషికాలే కాకుండా సినిమా నిర్మాణంపైనా భారీగా ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి భారీ సెట్లు, ప్రత్యేక ఆర్ట్ డైరెక్షన్, అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్ ప్రధాన ఆకర్షణలుగా ఉండనున్నాయి. అందుకే ఆర్ట్



# నెట్‌ఫ్లిక్స్‌లోకి పెద్ది

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'పెద్ది' నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే, థియేటర్ వెర్షన్ కంటే ఓటీటీలో కొన్ని సీన్స్ యాడ్ చేశారు. రన్‌టైం కారణంగా కట్ చేసిన సన్నివేశాలను, థియేటర్‌లో విడుదలైయ్యాక తొలగించిన సీన్స్‌ను కూడా ఇందులో యాడ్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో అభిమానులు ఖుష్ అవుతున్నారు. తెలుగుతో పాటు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఇది అందుబాటులోకి వచ్చింది. కథేంటంటే.. విజయనగరం జిల్లాలోని కొండ కింద ఊరు అది. వందల మంది జీవనం సాగిస్తున్నా.. ప్రభుత్వ రికార్డుల్లో ఆ ఊరికి గుర్తింపు లేదు. అందుకే ఆ ఊరు అన్నా, అక్కడి నుంచి వచ్చిన మనుషులన్నా అందరికీ చిన్న చూపు. ఆ ఊళ్లో పుట్టి పెరిగిన వాడే పెద్ది (రామ్‌చరణ్). రోజూ విజయనగరం వెళ్లి కూలి పనులు చేస్తాడు. పేరుకి కూలీ అయినా క్రికెట్‌లో మాత్రం రాటుదేలిన ఆటగాడు. అందుకే విజయనగరం, బొబ్బిలి క్రికెట్ జట్లు వేలంలో పెద్దిని కొనేందుకు పోటీపడుతుంటాయి. ఆరు బంతులకు ఆరు సిక్సర్లు కొట్టగలిగిన మొనగాడైన పెద్దిని అంతా ఆట కూలీ అని పిలుస్తుంటారు. అలాంటి పెద్ది క్రికెట్‌ని వదిలి కుస్తీ క్రీడాకారుడిగా ఎందుకు మారాల్సి వచ్చింది? ఈ కథలో అచ్చియమ్మ (జాన్వీ కపూర్) ఎవరు?తన గ్రామం కోసం పెద్ది ఏం చేశాడు? అన్నదే సినిమా కథ.




# వర్షంలో 12 గంటలపాటు ..

ప్రేక్షకులను అలరించడం కోసం నటీనటులు ఎంత కష్టాన్నైనా భరిస్తారు. పాత్ర కోసం ఎంత రిస్క్ అయినా తీసుకుంటారు. ప్రస్తుతం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో చిరంజీవి హీరోగా రానున్న మెగా 158 ఒకటైతే.. రష్మిక ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న 'మైసా' మరొకటి. ఈ చిత్రాల కోసం అటు చిరు.. ఇటు రష్మిక ఎంతో కష్టపడుతున్నారు. తాజాగా ఈ రెండు సినిమాల అప్‌డేట్స్‌ను ఆయా చిత్రబృందాలు పంచుకున్నాయి. మెగా 158లో వర్షంలో సీక్వెన్స్ కోసం చిరంజీవి 12 గంటలు ఏకధాటిగా షూటింగ్ చేయగా.. 'మైసా' కోసం రష్మిక అండర్ వాటర్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు. చిరంజీవి హీరోగా బాబీ దర్శకత్వంలో మెగా158 (వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన ఓ భారీ సెట్‌లో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు.






# జన నాయగన్ విడుదలకు సిద్ధం

విజయ్ 'జన నాయగన' కోసం అభిమానులు ఎన్నో నెలల నుంచి ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. సెన్సార్ సర్టిఫికెట్ ఆలస్యం కారణంగా నిలిచిపోయిన ఈ చిత్రం.. ఈ నెలలోనే విడుదల కావడం దాదాపు ఖాయంగానే కన్పిస్తోంది. దీనిపై కెనడా డిస్ట్రిబ్యూటర్ హింట్ ఇవ్వడంతో మరోసారి విడుదల తేదీపై చర్చ మొదలైంది. కెనడాకు చెందిన ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ యార్క్ సినిమాస్ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ చేసింది. 'ఎట్టకేలకు మన దళపతి విజయ్ 'జన నాయగన' సినిమాతో వెండితెరపై మెరిసేందుకు సిద్ధమయ్యారు. జులై 24 నుంచి కెనడాలో యార్క్ సినిమాస్ ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేస్తోంది' అంటూ ఓ పోస్టర్ పంచుకుంది. త్వరలోనే టికెట్ బుకింగ్స్ కూడా ఓపెన్ అవుతాయని తన పోస్ట్‌లో తెలిపింది. దీంతో ఈ తేదీకి రావడం దాదాపుగా ఖాయమైనట్లు తెలుస్తోంది. ఇక, దీనికి ఒక రోజు ముందుగానే భారత్‌లోనూ విడుదలయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. సెన్సార్ బోర్డు సూచించిన మార్పులకు చిత్రబృందం అంగీకరించింది. రెండు రోజుల్లో సెన్సార్ సర్టిఫికెట్ వస్తుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పనులు పూర్తికాగానే చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనుంది. ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్లకు జులై 24 విడుదలకు సిద్ధంగా ఉండాలని ఇప్పటికే సమాచారం అందినట్లు తెలుస్తోంది.




## మరికొన్న డబ్బింగ్ మూవీలు కూడా సందడి

ఈ నెల రెండో శుక్రవారం బాక్సాఫీస్ వద్ద సరికొత్త చిత్రాల సందడి నెలకొనబోతోంది. ఈ వారం టాలీవుడ్ నుంచి అఖిల్ అక్కినేని మోస్ట్ అవేటెడ్ యాక్షన్ డ్రామా 'లెనిన్' నేరుగా థియేటర్లలోకి వస్తుండగా, దీనికి పోటీగా భారీ సంఖ్యలో డబ్బింగ్ సినిమాలు కూడా రేసులో నిలిచాయి. ఇక వైవిధ్యమైన కథాంశాలతో, విభిన్న జోనర్లలో ప్రేక్షకులను అలరించేందుకు ఆసక్తికరమైన చిత్రాలు విడుదలవుతున్నాయి. అఖిల్ అక్కినేని కెరీర్‌లోనే అత్యంత రగ్డ్ లుక్‌లో కనిపించనున్న యాక్షన్ డ్రామా 'లెనిన్'. మురళి కిషోర్ అబ్బురు దర్శకత్వంలో రాయలసీమ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఒక అందమైన ప్రేమకథ హింసాత్మక మలుపులు తిరిగితే ఎలా ఉంటుందనే కథాంశంతో వస్తున్న ఈ సినిమాను నాగార్జున అక్కినేని, సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. థమన్ ఎస్ దీనికి సంగీతం అందించారు. ఇకపోతే మైథాలజీ మరియు యాక్షన్ ఎలిమెంట్స్‌తో వస్తోన్న చిత్రం 'వాసుదేవ సుతం'. పూరీ జగన్నాథ ఆలయంలో దాగి ఉన్న ఒక పవిత్రమైన శక్తిని రక్షించడానికి ఒక యువకుడు చేసే పోరాటమే ఈ సినిమా కథ. మాస్టర్ మహేంద్రన్, అంబికా వాణి, సుమేధా బజాజ్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి వైకుంఠ్ బోను దర్శకత్వం వహించగా, మణిశర్మ సంగీతాన్ని సమకూర్చారు. ఇకపోతే మలయాళంలో విడుదలై తెలుగులో రాబోతున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'ఐ, నోబడీ'. నిసామ్ బషీర్ దర్శకత్వంలో పృథ్వీరాజ్ సుకుమారన్, పార్వతి తిరువోతు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం, ఒక భారీ బ్యాంక్ దోపిడీ కేసులో అన్యాయంగా ఇరుక్కున్న ఒక సాధారణ వ్యక్తి తన నిర్దోషిత్వాన్ని ఎలా నిరూపించు కున్నాడు అనే కథతో సాగుతుంది. తమిళ రొమాంటిక్ కామెడీ చిత్రం 'లవ్ ఓ లవ' కూడా నేడు తెలుగు ప్రేక్షకులను పలకరించనుంది. మహేష్ రాజేంద్రన్ దర్శకత్వంలో పవిష్ నారాయణన్, నాగ దుర్గ, ఆదిత్య కతిర్ నటించిన ఈ సినిమా, అప్పుల్లో మునిగిపోయిన ఒక యువకుడి ప్రేమకథ చుట్టూ తిరుగుతుంది. ప్రేమ, బ్రేకప్ మరియు గుండె లోతుల్లోని భావాల సమాహారంగా వస్తోన్న భావోద్వేగభరిత చిత్రం 'హృదయం మురళి'. అథర్వ మురళి, ప్రీతి ముకుందన్ జంటగా ఆకాష్ భాస్కరన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో కాయాదు లోహర్, నిహారిక ఎన్.ఎమ్ ఇతర పాత్రలు పోషించారు. తమిళంలో 'ఇదయం మురళి'గా, తెలుగులో 'హృదయం మురళి'గా ఈ సినిమా రిలీజ్ కానుంది. బాలీవుడ్ నుంచి నవ్వుల పండగను తీసుకురావడానికి 'ధమాల్ 4' వస్తోంది. ఇంద్ర కుమార్ దర్శకత్వంలో అజయ్ దేవగన్, రితీష్ దేశ్‌ముఖ్, అర్షద్ వార్సి, జావేద్ జాఫేరి, సంజయ్ మిశ్రా, రవి కిషన్ కలయికలో వస్తోన్న ఈ క్రేజీ కామెడీ ఎంటర్‌టైనర్ ప్రేక్షకులను నవ్వించడానికి సిద్ధమైంది. ఇలా విభిన్నమైన జోనర్లతో, భారీ సంఖ్యలో డబ్బింగ్ సినిమాలతో ఈ శుక్రవారం బాక్సాఫీస్ కళకళలాడబోతోంది.

This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from **H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072.** Editor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com.
Corporate Office: HIG 79, VNR RESIDANCY ,VENKATARAMANA COLONY, KUKATPALLY ,HYDERABAD, 500085